

జిల్లా ప్రధాన న్యాయాధికారితో ఎస్పీ భేటీ



నెల్లూరు (క్రైం): జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై ఇద్దరు సంభాషించుకున్నారు.

'పర్యాటకం'పై బకాయిల బండ!

- ఉమ్మడి జిల్లాలో బీచ్ రిసార్ట్స్
- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో నిర్వహణ
- సుమారు రూ.80 కోట్ల వరకు అప్పు



నెల్లూరులోని హరితా హోటల్

ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒకప్పుడు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రూ.కోట్లు ఖర్చు చేసి బీచ్ రిసార్ట్స్ నిర్మించింది. నిర్వహణ బాధ్యతలు మాత్రం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. ఆ వచ్చే ఆదాయంతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయొచ్చని పాలకులు, అధికారులు భావించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇప్పుడు ఆ నిర్ణయమే గుడిబండగా మారింది. ప్రైవేటు వ్యక్తులు ఏళ్ల తరబడి అద్దె చెల్లించడం లేదు. పైగా వచ్చే పర్యాటకులకు కనీస వసతులు కూడా కల్పించడం లేదనే వాదనలు వినబడుతున్నాయి.

- వివరాలు 8లో..



వెంకటాచలం : కసుమూరులో భక్తుల రద్దీ



ఏఎస్‌పేటలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేడుకగా గంధమహోత్సవం

వెంకటాచలం మండలం కసుమూరు, ఏఎస్‌పేటలలో శుక్రవారం గంధమహోత్సవం వేడుకగా జరిగింది. కసుమూరులోని మస్తాన్ వలి దర్గాలో కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ, ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఎస్‌పేటలోని హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా గంధమహోత్సవం కూడా వేడుకగా జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చారు.

- వివరాలు 8లో..

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

అనంతసాగరం సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షానికి సోమశిల జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. గురువారం 18,715 క్యూసెక్కుల ప్రవాహం రాగా, శుక్రవారం 25,449 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో నీటి నిల్వ 73.866 టీఎంసీలకు చేరుకుంది. 5, 6 గేట్లు ఎత్తి దిగువ డెల్టాకు 19,650 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 400, కండలేరుకు వరద కాలువ ద్వారా 10,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

- **రాపూరు** : కండలేరు డ్యాంకు 10,100 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 49.386 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 1330 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తు చేసుకుంటారా..

ధ్వంసం చేయమంటారా!?

'ఎల్‌ఆర్‌ఎస్'పై ఇంత లెక్కలేనితనమా!?

రియల్టర్లపై నుడా చైర్మన్ కోటంరెడ్డి ఆగ్రహం



'రాష్ట్ర ప్రభుత్వం సదుద్దేశంతో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు (ఎల్‌ఆర్‌ఎస్) అవకాశం ఇచ్చింది. కానీ చాలామంది రియల్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 437 అక్రమ లేఅవుట్లను గుర్తిస్తే కేవలం 23 లేఅవుట్ల యజమానులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇది ఎంతవరకు సబబు. ఇకపై ఉపేక్షించే ప్రసక్తే లేదు. గడువులోగా దరఖాస్తు చేసుకుంటే సరే. లేదా సదరు లే అవుట్లను ధ్వంసం చేస్తాం. వారికి వత్తాసు పలికే పంచాయతీ కార్యదర్శులు, అధికారులపైనా చర్యలు ఉంటాయి.'

- విలేకరుల సమావేశంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

- వివరాలు 8లో..

రిలయన్స్ భూముల్లో పరిశ్రమల ఏర్పాటు ఎప్పుడు?

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



ముత్తుకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రిలయన్స్ భూముల్లో పరిశ్రమలను ఎప్పుడు ఏర్పాటు చేస్తారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో రిలయన్స్ కంపెనీకి 2007లో ఎకరా రూ.7.5 లక్షల చొప్పున 2700 ఎకరాలు తీసుకున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు దాటుతున్నా ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని, అసలు ఆ కంపెనీ పరిశ్రమలు పెట్టగలదా, లేదా తెలియడం లేదన్నారు. కిసాన్ సెజ్‌లో 2600, రిలయన్స్ కోసం తీసుకున్న 2700 ఎకరాలు ఖాళీగా ఉన్నాయన్నారు. కృష్ణపట్నం సెజ్ కోసం రైతులకు ఎకరాకు రూ.4లక్షలు, ప్రభుత్వ భూమికి రూ.1లక్ష చెల్లించి 6వేల ఎకరాలకు పైగా సేకరించారన్నారు. దశాబ్దాలుగా ఈ భూములు ఖాళీగా మిగిలిపోయాయని, స్థానిక రైతు కూలీలకు కూడా ఉపాధి లేకుండా పోయిందన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయని భూములను వెనక్కు తీసుకుని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సమాధానమిస్తూ రిలయన్స్ భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు ప్రకటించారు.



కనిగిరి రిజర్వాయర్‌ను ఆధునీకరించండి

- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కోవూరు, సెప్టెంబరు19, (ఆంధ్రజ్యోతి) : కనిగిరి రిజర్వాయర్ ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. క్రస్టగేట్లు తుప్పు పట్టడంతో డ్యాంలో నీటి నిల్వ ఉండటంలేదన్నారు. 1.30 లక్షల ఎకరాలకు సాగునీరందించే రిజర్వాయర్‌ను ఆధునీకరించి డెల్టా రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అలాగే 2021లో వచ్చిన వరదలకు పెన్నానది పొర్లుకట్టలు ధ్వంసమై, పల్లిపాడులోని గాంధీ ఆశ్రమం వరద కోతకు గురైనట్లు తెలిపారు. అప్పటి ప్రభుత్వం దీనిని పూర్తిగా విస్మరించిందని చెప్పారు. పెనుబల్లి, పోతిరెడ్డిపాళెం, జమ్మిపాళెం, ముదివర్తి వద్ద పొర్లుకట్టలను బలోపేతం చర్యలు తీసుకోవాలన్నారు. 2,776 ఎకరాల్లో ఉన్న ఇఫ్కో సెజ్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కోరారు. అదేవిధంగా కొడవలూరు మండలం రాచర్లపాడు, బొడ్డువారిపాళెంలో ఉన్న ఏపీఐఐసీ పార్కులో పరిశ్రమలు నెలకొల్పేలా చూడాలని కోరారు.

రెవెన్యూ తీరు మారేనా!?

- పీజీఆర్‌ఎస్‌లో సగం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు
- కొత్త కలెక్టర్‌కు సవాల్‌గా రెవెన్యూ శాఖ

రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే అర్జీల్లో 60 శాతం రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉంటున్నాయి. ఎక్కువ సవాళ్లూ ఈ శాఖలోనే ఉన్నాయి. ఏ జిల్లాలో రెవెన్యూ సమస్యలు తక్కువగా వస్తే ఆ జిల్లా అధికారులు బాగా పనిచేస్తున్నట్లు లెక్క. ఎక్కడ ఎక్కువ సమస్యలు వస్తే అక్కడ కలెక్టర్ సహా జిల్లా యంత్రాంగం సరిగా పనిచేయడం లేదని అర్థం. రెవెన్యూ శాఖ పనితీరు మారాలి. ఇకపై నేను కూడా ఎక్కువగా రెవెన్యూ శాఖపై దృష్టి పెడతా.

- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

మా భూమిని నిబంధనలకు విరుద్ధంగా మ్యుటేషన్ చేశారు. హైకోర్టును కూడా తప్పుదారి పట్టిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ కూడా ఈ మ్యుటేషన్‌ను డిస్ప్యూట్‌లో పెట్టమ ని ఉత్తర్వులిచ్చారు. కానీ అవతల వ్యక్తులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునే వరకూ జేసీ ఉత్తర్వులు అమలు చేయలేదు. గతంలో అర్జీ ఇచ్చినప్పుడు మండలాధికారులపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. అయినా మాకు ఎటువంటి న్యాయం చేయలేదు. 104 రోజులు ఆర్డీవో తన లాగిన్‌లో మా అర్జీను ఉంచుకొని మళ్లీ పాత కథ మాదిరిగానే మండలాధికారులు ఇచ్చిన తప్పుడు సమాచారాన్ని మాకు ఇచ్చి అర్జీ క్లోజ్ చేశారు.

- ఇది ఇటీవల గ్రీవెన్స్‌లో ఓ బాధితుడి ఆవేదన

ఎన్ని గ్రామసభలు నిర్వహించినా.. మరిన్ని సమావేశాల ద్వారా అర్జీలు స్వీకరించినా.. రెవెన్యూ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఈ ప్రభావం ప్రజలపై తీవ్రంగా పడుతోంది. ఒకసారి వచ్చిన అర్జీదారుడే మళ్లీ అదే సమస్యతో ఉన్నతాధికారుల వద్దకు వస్తున్నారు. మరోవైపు ఈ అర్జీల పరిష్కా రంపై ఆడిట్ నిర్వహిస్తు న్నా పరిస్థితిలో మార్పు రాకపోతుం డడం ఆందోళన కలిగిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ సమస్యలపై దృష్టి పెట్టింది. గత ప్రభుత్వంలో నిర్దిష్ట విధానం అంటూ లేకుండా చేపట్టిన రీసర్వే ద్వారా అనేక కొత్త సమస్యలు వచ్చాయని గుర్తించిన ప్రభుత్వం.. తొలుత రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సదస్సులు నిర్వ హించింది. 300లకుపైగా గ్రామాల్లో గతేడాది అక్టోబరు 19 నుంచి నవంబరు 14వ తేదీ వ రకూ రెవెన్యూ సదస్సులు జరిగాయి. అప్పుడు 8406 అర్జీలు ప్రజల నుంచి అందాయి. ఆ తర్వాత మరోసారి గతేడాది డిసెంబరు 6 నుంచి ఈ ఏడాది జనవరి 8వ తేదీ వర కూ జిల్లాలో 731 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈదఫా 8132 అర్జీలు భూ సమస్యలకు సంబంధించి అధికారులకు అందాయి. వీటన్నిటినీ పరిష్కరించినట్లు లెక్కలు చూపిస్తున్నారు. అయినా ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా విజ్ఞప్తుల కార్యక్ర మం (గ్రీవెన్స్)లో భూ సమస్యలకు సంబంధిం చిన అర్జీల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. గత నెల రోజుల్లో వచ్చిన అర్జీలను పరిశీలి స్తే.. ఆగస్టు 11న పీజీఆర్‌ఎస్‌లో 411 అర్జీలు రాగా అందులో 160 రెవెన్యూ, సర్వే శాఖలకు చెందినవే ఉన్నాయి. ఆగస్టు 18న పీజీఆర్‌ఎస్‌లో 426 అర్జీలు రాగా అందులో 163, ఆగస్టు 25న 426 అర్జీలు రాగా ఇందులో 212, సెప్టెంబరు 1న 436 అర్జీలు రాగా ఇందులో 192, సెప్టెంబరు 8న 515 అర్జీలు రాగా అందులో 252 అర్జీలు రెవెన్యూ, సర్వే శాఖలకు చెందినవే ఉండటం గమనార్హం. దీనిని బట్టి క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సమస్య పరిష్కారం కాలేదంటూ రీఓపెన్ అవుతున్న అర్జీల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. మిగిలిన జిల్లాలతో పోలిస్తే రీఓపెన్ అర్జీల శాతం జిల్లాలో ఎక్కువగా ఉంటున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.



- సీఎం ఆదేశాలతోనైనా గాడిన పడేనా..!
- ప్రహసనంలా భూ సమస్యల పరిష్కారం
- మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ బాధితులు

తప్పులు తేలినా చర్యల్లేవు!

గత ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలు అన్నీ ఇన్నీ కాదు. పేదల ఇళ్లకు భూమి కొనుగోలు, ఫ్రీహోల్డ్ పేరుతో అసైన్‌మెంట్ భూములు కొట్టేయడం వంటి అక్రమాలు ఇప్పటికే బయటపడ్డాయి. అయితే ఈ కుంభకోణాలపై ప్రభుత్వ నిర్ణయం కావాలంటూ జిల్లా అధికారులు తప్పించు కుంటున్నారు. పోనీ జిల్లాస్థాయిలో తీసు కోవాల్సిన చర్యలపైనా తగిన విధంగా స్పందిస్తున్నారా.. అంటే అదీ లేదు. జిల్లాలో అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ వ్యవహారంపై మాత్రం ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పేదలు కాకపోయినా వైసీపీ నాయకులు అనే అర్హతతో గత ప్రభుత్వంలో ప్రభుత్వ భూములను ధారాదత్తం చేశారు. కొండ పోరంబోకులు, చెరువు పోరంబోకులు వంటి భూములనూ కట్టబెట్టారు. ఇంకొందరైతే ఏకంగా ప్రభుత్వ భూములను వారి పేర్లపైకి మార్చుకున్నారు. ఒక్కొక్కటిగా ఇటువంటి అక్రమాలు వెలుగులోకి వస్తున్నా రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవడంలో విఫల మవుతోంది. ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనంలో చేసుకోవడం లేదు. సూరా యపాలెంలోని మేత పోరంబోకు భూములే ఇందుకు ఒక ఉదాహరణ. ఈ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా నూతన కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా బాధ్యతలు చేపట్టారు. ఆయన వచ్చీ రాగానే జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కూడా రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం చంద్రబా బు దిశానిర్దేశం చేసి పంపారు. మరి రెవెన్యూ శాఖను గాడిలో పెట్టేందుకు కొత్త కలెక్టర్ ఎటువంటి ప్రణాళికలు రూపొందించుకుంటారన్నది చూడాలి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

ఇక క్రీడా సంబరం!

ప్రతిష్ఠాత్మకంగా సంసద్ ఖేల్ మహోత్సవ్-2025

జిల్లాలో 100 రోజులపాటు నిర్వహణ

ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం

వివరాలు 8లో..

ఈ ఏడాది పన్ను లక్ష్యం రూ.100 కోట్లు

- రెవెన్యూ అధికారులతో ఆర్డీఎంఏ హరికృష్ణ

నెల్లూరు(సిటీ),సెప్టెంబరు 19,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఈ ఏడాది రూ.100 కోట్లు పన్ను వసూళ్ల లక్ష్యంగా రెవెన్యూ అధికారులు పని చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీఎంఏ) హరికృష్ణ ఆదేశించారు. శుక్రవారం ఎన్ఎంసీలో రెవెన్యూ విభాగంతో కమిషనర్ నందన్‌తో కలిసి ఆయన సమీక్షించారు. రాష్ట్రంలోని 15 కార్పొరేషన్‌లతో పోటీపడుతున్న తొలి నాలుగు స్థానాల్లో నిలిచే విధంగా పన్ను వసూళ్లు చేయాలని సూచించారు. వాణిజ్యపరంగా మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. గతేడాది వీఎల్టీల ద్వారా వచ్చిన పన్నులను ఈ ఏడాది కూడా వసూళ్లు చేయాలని, ఆ దిశగా సచివాలయ అడ్మిన్లు చొరవ చూపాలని సూచించారు. లేకపోతే శాఖపరమైన చర్యలు తప్పని హెచ్చరించారు. కొత్త భవనాల్లో అదనపు అంతస్తులు, రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్‌కు మారిన భవనాల పన్నులను నిష్పక్షపాతంగా వేయాలన్నారు. ఈ సమీక్షలో డీసీ చెన్నుడు, ఆర్వోలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

గుడ్లూరులో ఇండస్ట్రియల్ హబ్

- వేగవంతంగా భూసేకరణ : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. 15090 ఎరాకలు ఈ హబ్‌కు అవసరం కాగా ఇప్పటి వరకు 1875 ఎకరాలు భూసేకరణ పూర్తయి, పరిశ్రమల కోసం సిద్ధంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో మరింత వేగవంతంగా భూసేకరణ జరుగుతుందని వివరించారు. ఈ హబ్‌లో భారత పెట్రోలియం కార్పొరేషన్ వంటి ప్రధాన పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, వీటిద్వారా ప్రత్యక్షంగా వేలాది మంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం న్యాయపరమైన పరిహారం అందజేస్తుందని తెలిపారు.

'వాహన మిత్ర' గడువు పెంపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : వాహన మిత్ర పథకం దరఖాస్తు గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. వాహన రిజిస్ట్రేషన్ కార్డు, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తదితర సర్టిఫికెట్స్‌తో అర్హులైన వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతంలో 2023 ఈ పథకం కోసం దరఖాస్తు చేసిన వారు మరలా చేసుకోవాల్సిన అవసరం లేదని, ఇప్పటి వరకు దరఖాస్తు చేయని వారు మాత్రమే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మబ్బులు పట్టి... వాన కురిసి!

ఉదయం నుంచి సెగలు కక్కిన భానుడిని మబ్బులు కమ్మేశాయి. ఆ తర్వాత మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వాతావరణాన్ని చలబరిచింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి జిల్లాలోని పలుప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కోతలు పూర్తయి, ధాన్యాన్ని ఆరబెట్టుకున్న రైతులు ఇబ్బందులకు గురయ్యాయి. ఇక నగరంలోని లోతట్టు ప్రాంతాలు, రోడ్లపై నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



నెల్లూరు నగరాన్ని కమ్మేసిన కారు మబ్బులు, వర్షంలో మోటారు సైకిలిస్ట్



యూరియా పంపిణీకి

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

రైతుల అవసరాలను గుర్తించాలి

వ్యవసాయ అధికారులతో కలెక్టర్ శుక్లా

నెల్లూరు (వ్యవసాయం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యూరియా అవసరాలు, పంపిణీకి సంబంధించి మండలాల వారీగా రైతుల అవసరాలను గుర్తించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖలతో కలెక్టర్ సమీక్షించారు. ప్రతి రైతుకు నిర్ణీత కార్డులను అందజేసి యూరియా పంపిణీ వివరాలను అందులో నమోదు చేయాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతుల అవసరాలకు అనువైన యంత్రాలను గుర్తించాలని వాటి ఖరీదు, కూలీల ద్వారా అయ్యే ఖర్చులు రెండింటినీ బేరీజు వేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. యంత్రాల కొనుగోలుకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలని సూచించారు. మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించి ఈ ఏడాదికి నిర్దేశించిన 6వేల హెక్టార్లకు సంబంధించి పరిపాలన అనుమతులను అక్టోబరు మొదటి వారంలోపు మంజూరు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి, డీసీఓ గుర్రప్ప, మత్స్యశాఖ జేడీ శాంతి, పశుసంవర్థక శాఖ జేడీ రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, APEWIDC డిపార్టుమెంటు, నెల్లూరు
షార్ట్ టెండరు నోటీసు NIT నెం.HD/2/2025-2026, తేది: 19-09-2025.

APEWIDC నెల్లూరు రూరల్ మండలములో అక్కచెరువుపాడు రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌నకు మరమ్మత్తుల చేయుటకు గాను అంచనా 32.00 లక్షలతో టెండర్లు కోరబడుతున్నవి. టెండర్ డాక్యుమెంట్లు 23.09.2025 నుండి అందుబాటులో ఉండును. ఇతర వివరములు కొరకు www.apeprocurement.gov.in లో లభ్యమగును.
ఫోన్ నెం.7993702697 సం/- కార్యనిర్వాహక ఇంజనీరు
APEWIDC, DIVISION, నెల్లూరు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము :: గిరిజన కోపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్
గిరిజన ప్రాథమిక సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్,
ఐ.టి.డి.ఏ. ఆఫీస్ కాంప్లెక్స్, కొండాయపాలెం గేటు దగ్గర, నెల్లూరు
Rc.No.GPCMS/NLR/15/2025 Dt.19-09-2025

స్వల్ప టెండర్ ప్రకటన

గిరిజన సహకార సంస్థ, నెల్లూరు వారు ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు మరియు కడప జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థల కొరకు 2025-26 విద్యా సంవత్సరమునకు కావలసిన నిత్యావసర సరుకులు సరఫరా చేయుటకు స్వల్పకాలిక టెండర్లు కోరబడుచున్నవి. సరుకు సంబంధిత వ్యాపారములతో ప్రభుత్వ రంగ సంస్థలకు సరఫరా చేసిన అనుభవం, వ్యాపారమునకు సంబంధించిన రిజిస్ట్రేషన్, జి.ఎస్.టి. రెగ్యులర్, ఇన్‌కంటాక్స్ క్లియరెన్స్ కలవారు ఆ పత్రములను సమర్పించి టెండరు ఫారములను మేనేజరు, గిరిజన ప్రాథమిక సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్, నెల్లూరు వారి కార్యాలయములో Rs.10,000/- (అక్షరములా పది వేల రూపాయలు మాత్రమే) చెల్లించి తేది.20-09-2025 నుండి 29-09-2025 మధ్యాహ్నం గం.12.00లోగ కార్యాలయపు పనివేళలో టెండరు ఫారంలను పొందగలరు. పూర్తిచేసిన టెండరు ఫారములను తేది.29-09-2025 మధ్యాహ్నం గం.1.00 గంటల వరకు మేనేజరు, గిరిజన ప్రాథమిక సహకారా మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్, నెల్లూరు వారి కార్యాలయములో స్వయముగా సమర్పించవలెను. పోస్టు ద్వారా టెండర్లు స్వీకరించబడవు. నిర్దేశిత గడువులోగా అందిన టెండర్లను ఐ.టి.డి.ఏ. కార్యాలయములో తేది.29-09-2025న మధ్యాహ్నం గం.2.00లకు కమిటీ సమక్షములో టెండర్లను తెరువబడును. పై విషయములలో టెండర్లు రద్దు చేయుటకు గాని, వాయిదా వేయుటగాని ఈ క్రింది సంతకందారునకు సంపూర్ణ అధికారము కలదు. ఇతర వివరముల కొరకు మొబైల్ నెం.8886668193ను సంప్రదించగలరు.

ప్రాజెక్ట్ అధికారి / చైర్మన్
కొనుగోలు కమిటీ, ఐ.టి.డి.ఏ. (యానాదులు), శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

సర్పంచులపై నిందలు మోపొద్దు

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్పంచులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులు చేస్తుందని, వారిపై నిందలు వేయడం సరికాదని, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జిల్లా పంచాయతీ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. సర్పంచులకు జిల్లా పంచాయతీ అధికారి ఇచ్చిన షోకాజు నోటీసులకు వివరణ అడిగారు. ఆయన మాట్లాడుతూ కరెంటు బిల్లులు చెల్లించినా, నిధులు దుర్వినియోగం అయ్యాయని, సర్పంచులపై ఎలా చర్యలు చేపడతారని ప్రశ్నించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10511
వెండి కిలో ధర	రూ. 133800
వెండి ఒక గ్రాము	రూ. 136.80

మోతాదు మించితే ముప్పే!

- అధికంగా యూరియా వాడితే భూసారం తగ్గుతుంది
- అవగాహన లేమితో నష్టపోతున్న అన్నదాతలు



మనుబోలు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసిన పంటలు సత్వరమే ఎదగాలంటే యూరియా వాడకం తప్పనిసరి అన్న పరిస్థితులు వ్యవసాయ రంగంలో నెలకొన్నాయి. ప్రధానంగా యూరియా వాడితే పంట దిగుబడులు బాగా వస్తాయని రైతులు అధికంగా యూరియాను వాడుతున్నారు. ప్రస్తుత వ్యవసాయ విధానంలో గతంలో కన్నా రెట్టింపు స్థాయిలో రైతులు యూరియాను వినియోగిస్తున్నారని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. అయితే యూరియా వాడకం అధికమైతే అనర్థాలేనని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా భూసారం దెబ్బతిని, నేల సహజత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

సహజంగా వరిసాగు చేసే రైతులు పంటసాగు నుంచి నూర్పిడి (కోతలు) వరకు 25 కేజీల చొప్పున యూరియా మూడు విడతలుగా 75 కేజీలు వాడాల్సి ఉంది. అలాగే యూరియాకు తోడు మరో 75 కేజీల కాంప్లెక్స్ ఎరువులు వినియోంచుకోవచ్చు. అయితే రైతుల అవగాహన లేమి కారణంగా 150 కేజీల యూరియా (3బస్తాలు), దీంతో పాటు మరో 3 బస్తాల కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో రైతులకు ఎరువుల భారం అమాంతం పెరిగిపోతుంది. ప్రస్తుతం ఎరువుల ధరలను బట్టిచూస్తే ఎరువులు ఎక్కువగా వాడడం వల్ల రైతులకు అదనంగా రూ. 6 వేలు ఎరువుల ఖర్చు అధికమవుతోంది. సహజంగా ఎకరా వరి పంటకు 72 కిలోల నత్రజని మాత్రమే అవసరం అవుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాంప్లెక్స్ ఎరువుల్లో నత్రజని మిళతమై ఉంటుందని, ఇది అవగాహన లేక రైతులు యూరియాను అధికంగా వాడి పొలాలను పాడు చేసుకుంటున్నారని వ్యవసాయ శాఖాధికారులు అంటున్నారు. అందుకే రైతులు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తే భూమి దెబ్బ తినకుండా ఉండడంతో పాటు, సాగుభారం తగ్గించుకోవచ్చునని పేర్కొంటున్నారు.

ఎక్కువగా వాడితే అనర్థాలే...

యూరియాను అధికంగా వాడితే ప్రకృతిపరంగా చాలా అనర్థాలు జరిగే ప్రమాదం ఉందని ఊరూరా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు ర్యాలీలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అధిక యూరియా వాడకంతో పొలాలు సహజత్వాన్ని కోల్పోయి, భవిష్యత్తులో ఎన్ని ఎరువులు వేసినా పంటలు పండకపోయే ప్రమాదం ఉందని తెలుపుతున్నారు. భూసారం పెరిగే చర్యలు చేపట్టి, ఎరువుల వాడకం తగ్గిస్తే ఎంతో మేలు కలుగుతుంది. వరిసాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులు వేసి, వాటిని కలియదున్నితే భూసారం పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే భూసార పరీక్షలు చేయించి, ఫలితాల ఆధారంగా ఎరువులు, దీంతో పాటు జింకు తదితర వంటి సూక్ష్మ పోషకాలు వాడగలిగితే రైతులకు మేలు కలుగు తుంది. దీనిపైన వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు మరింతగా అన్నదాతలకు అవగాహన కల్పించి యూరియా వాడకాన్ని తగ్గించగలిగితే ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం సఫలమవుతుంది.

అవగాహన కల్పిస్తూనే ఉన్నాం



ఏ పంటకు ఎంత శాతం ఎరువు వినియోగించాలన్న విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తూనే ఉన్నాం. వారంలో రెండు రోజులు 'పొలం బడి, పొలం పిలుస్తోంది' కార్యక్రమాల ద్వారా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. పొలాల వద్దకు రైతులను తీసుకెళ్ళి ప్రదర్శనల ద్వారా వివరిస్తున్నాం. రైతులు వ్యవసాయశాఖాధికారుల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలి.

\- వెంకటకృష్ణయ్య, మండల వ్యవసాయాధికారి, మనుబోలు.



విద్యార్థులకు నాణ్యమైన భోజనం

- ఘట్టమనేని రాంబాబు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, పల్లెపాడు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో ఎస్సీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందిస్తున్నామని పల్లెపాడు సాంఘిక సంక్షేమ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఘట్టమనేని రాంబాబు తెలిపారు.

?. ఒక్కో విద్యార్థికి కాస్మొటిక్ చార్జీలు ఎంత చెల్లిస్తారు

!. ప్రతీ నెలా ఒక్కో విద్యార్థికి కాస్మోటిక్ చార్జీల కింద రూ. 200 ప్రభుత్వమే వారి అకౌంట్లలో జమ చేస్తుంది.

?. పిల్లలకు ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు.

!. నెలనెలా ప్రభుత్వ వైద్యులచే విద్యార్థు లకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నాం. అనారోగ్య సమస్యలు తలె త్తకుండా శుభ్రత పాటించేలా చర్యలు జాగ్ర త్తలు తీసుకుంటున్నాం.

?. మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా

!. పిల్లలకు ఉదయం ఆరు గంటలకు పాలు, 8 గంటలకు పులిహోరా, పప్పు పొంగలి, పూరీ, ఇడ్లీ, ఉప్మా మొదలైన అల్పాహారం రోజుకొక రకం అందిస్తున్నాం.

?. ప్రతీ ఏటా ఉత్తీర్ణత శాతం ఎలా ఉంది

!. మూడు సంవత్సరాలుగా విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు.

ఆసిఫా తాజీంకు డాక్టరేట్ ప్రదానం



వెంకటాచలం, సెప్టెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని ఆసిఫా తాజీంకు వీఎస్‌యూ శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఏ స్టడీ ఆన్ సోషల్ మీడియా మార్కెటింగ్ ఆన్ ఎలక్ట్రానిక్ గూడ్స్ కన్స్యూమర్స్' అనే అంశంపై డాక్టర్ జే విజేత పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. దీంతో శుక్రవారం వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ జీ సాయిస్రవంతి తదితరులు ఆసిఫా తాజీంను అభినందించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సంపత్‌రెడ్డి

ముత్తుకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్ర జ్యోతి) : ముత్తుకూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం బీజేపీ నాయకులు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు వేళ్లపాలెం సంపత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ 75వ జన్మదినం సందర్భంగా పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. ఈపూరు సాయి, మునెమ్మ, విజయ్, పవన్, శ్రావణ్, లోకేష్, టీడీపీ నాయకుడు సాయికృష్ణ పాల్గొన్నారు.

22 నుంచి దసరా ఉత్సవాలు

రాపూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో ఈనెల 22వ తేదీ నుంచి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. అక్టోబరు 2న ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఉత్సవ అలంకారం, ఉచిత సామూహిక కుంకుమార్చన జరుగుతుందన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

రుణాలన్నీ పలుకుబడి ఉన్న రైతులకేనా!?

వవ్వేరు బ్యాంకు సర్వసభ్య సమావేశంలో రైతుల గోడు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వవ్వేరు బ్యాంకులో పలుకుబడి వున్న రైతులకే దీర్ఘకాలిక రుణాల పేరుతో లక్షల రూపాయలు దోచిపెడుతూ చిన్న, సన్నకారు రైతులకు మొండిచేయి చూపుతున్నారని రైతు బొర్రు రాము, పలువురు రైతులు ఆవే దన వ్యక్తం చేశారు. శుక్రవారం బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు బ్యాంకులో ఛైర్‌పర్సన్ దొడ్ల విజయలక్ష్మి అధ్యక్షతన బ్యాంకు సీఈఓ ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో రైతులు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. యూరియా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపిస్తోందని ముత్యాల గుర్నాథం అన్నారు. రాజకీయ జోక్యంతో వేసే కమిటీల వల్ల బ్యాంకు అభివృద్ధి కుంటుపడుతోందని విమర్శించారు. ఈ విషయంపై స్పందించిన రైతు అమర్నాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వవ్వేరు బ్యాంకు ఛైర్‌పర్సన్‌గా దొడ్ల విజయలక్ష్మికి పదవి ఇవ్వడం అనేది ఆ పదవికే ఆభరణమని కొనియాడారు. అదే విధంగా నియోజకవర్గంలో నిజాయితీ కలిగిన కుటుంబాలకు చెందిన వ్యక్తులకు నామినేటెడ్ పదవులు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు మద్దిసాని మాల్యాద్రి, కోవూరు పద్మ, దొడ్ల కోదండ రామిరెడ్డి, పలు పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మైపాడులో 'మన బీచ్- మన శుభ్రత'



సముద్ర తీర ప్రాంతంలో వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైపాడు సముద్ర తీర ప్రాంతంలో శుక్రవారం 'మన బీచ్- మన శుభ్రత' కార్యక్రమం నిర్వహించారు. భారత్ స్కౌట్స్ అండ్ గేమ్స్ టీమ్స్ సహకారంతో తీర ప్రాంతంలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు సేకరించి అక్కడినుంచి తరలించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీ డీఈవో ఎస్‌వీ నాయక్, నెల్లూరు ఎంఈఓ మురళీధర్, ఇందుకూరుపేట ఎంఈవో సునీల్, గంగపట్నం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చలపతి, నరసాపురం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విడవలూరు : రామతీర్థంలో ఇంటర్నేషనల్ బీచ్ క్లీనప్ డే సందర్భంగా శనివారం 'మన బీచ్- మన శుభ్రత' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, వైద్యశాఖ అధికారులు, ప్రజాసేవ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కొండూరు బాబు పాల్గొంటారన్నారు.

విడవలూరులో వీఆర్‌ఏల ధర్నా



వినతిపత్రం సమర్పిస్తున్న వీఆర్‌ఏలు

విడవలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏలు) శుక్రవారం ధర్నా చేశారు. తహసీల్దారు పీ చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పిం చారు. ధర్నాలో వీఆర్‌ఏల సంఘం నాయకులు రావూరి శ్రీనివాసులు, సూరి స్వరూప, అమరావతి, శీనమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దర్గా పరిసరాల్లో లోపించిన పారిశుధ్యం

- దర్గా ఆవరణలో గుట్కా మరకలు
- పట్టించుకోని వక్ఫ్‌బోర్డు అధికారులు



ఈవో కార్యాలయం పక్కనే లోపించిన పారిశుధ్యం

వెంకటాచలం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి 248వ గంధమహోత్సవం వైభవంగా జరిగింది. కానీ వక్ఫ్‌బోర్డు అధికారులు పారిశుధ్య చర్యలు మెరుగుపరచడం విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. దర్గా ఆవరణతోపాటు పరిసర ప్రాంతాలు, చెరువు కట్ట, దర్గా ప్రధాన మార్గం, కసుమూరు గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, కిల్లీ, గుట్కా మరకలే దర్శనమిచ్చాయి. పారిశుధ్య మెరుగు చర్యలు చేపట్టడంలో వక్ఫ్ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఒకనొక దశలో అధికారుల తీరుపై గ్రామస్తులు, భక్తులు పెదవి విరిచారు.

వక్ఫ్‌బోర్డు అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం

గురువారం అర్ధరాత్రి బంగళా (చందన్ మహల్) నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చే సమయంలో ఆనవా యితీ ప్రకారం వక్ఫ్‌బోర్డు అధికారులు దగ్గరుం టారు. కేవలం వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్స్‌పెక్టర్ ఖుదావన్, మరొకరిద్దరు మినహా ఎక్కువ సేపు కూడా అక్కడ ఉండలేదు. దీనికి కారణంగా బంగళా వద్ద ఏర్పాట్లు సక్రమంగా లేవని, గతంతో పోల్చితే ఈ ఏడాది నామమాత్రంగానే ఏర్పాట్లు చేశారని గ్రామస్తులు వక్ఫ్‌బోర్డు అధికారులపై మండిపడ్డారు. వక్ఫ్‌బోర్డు ప్రత్యేక పాసులు కూడా ఇష్టానుసారంగా ఇచ్చారన్న విమర్శలు వినిపించాయి. గంధమహోత్సవం సందర్భంగా మస్తాన్ స్వామి సమాధి పూల అలంకరణ విషయాన్ని వక్ఫ్‌బోర్డు అధికారులు విస్మరించారు. దీనిపై అధికారుల తీరుపై భక్తులు మండిపడ్డారు. నిర్వహణ, ఏర్పాట్ల కోసం వక్ఫ్‌బోర్డు శాఖ రూ.16 లక్షలు మంజూరు చేసినట్లు అధికారులు చెప్పుకుంటున్నారే తప్ప ఈ ఏడాది ఏర్పాట్లు సక్రమంగా చేయలేదని భక్తులు అంటున్నారు.

మహిళల ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాలు



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

పొదలకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వీ శ్రీకావ్య, టీడీపీ నాయకుడు నెట్టెం పెంచలయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వావిటిపర్తి సచివాలయంలో నిర్వహించిన 'స్వస్థ్ నారీ- స్వశక్త్ పరివార్ అభియాన్' కార్య క్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకావ్య మాట్లా డుతూ మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఎంఎల్‌హెచ్‌పీ మెర్సీ స్వరూప, అమల, ఏఎన్‌ఎం వై ప్రసన్న, మాధవి, అంకమ్మ, రత్నకుమారి, ఆశా కార్యకర్తలు పెంచలమ్మ, సుమతి, అంగన్ వాడీ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్ పద్మమ్మ, ఉష, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం : మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ మల్లుగుంట సంఘంలో శుక్రవారం 'స్వస్థ్ నారి - సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్ ప్రవళ్ళిక విచ్చేశారు. ఈసందర్భంగా గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు, మహిళలకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారం, వ్యాధి నిరోధక టీకాలు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, ఎన్సీడీ వ్యాధులపై అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీఎంజేఏవై జిల్లా టీం లీడర్ కోటేశ్వరరావు, సీడీపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాపూరు: మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని రాపూరు ప్రభుత్వ సామాజిక కేంద్రం గైనకాలజిస్టు డాక్టర్ మమత తెలిపారు. శుక్రవారం రాపూరు ప్రభుత్వ సామాజిక కేంద్రంలో నిర్వహించిన స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో సుమారు 330 మంది మహిళలకు వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులపె అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మమత, హరీష్, శ్రావణి, నజ్మ, ప్రసాద్, మాధవి, చక్రవర్తి, హరిలత, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెన్నా నదికి రివిట్‌మెంట్ వాల్ నిర్మించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : నగరంలోని భగత్ సింగ్ కాలనీ వద్ద పెన్నానదికి రివిట్‌మెంట్ వాల్ నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని జలవరుల శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ రివిట్‌మెంట్ వాల్ నిర్మాణం ప్రారంభించి మూడేళ్ల గడుస్తున్నా నేటికీ పూర్తి చేయకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. గతంలో ప్రమాద వశాత్తు ఇద్దరు మహిళలు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాకాలంలో వరదలు వస్తే అనేక ఇళ్లు కోతకు గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. వెంటనే నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. త్వరితగతిన రివిట్‌మెంట్ నిర్మాణాన్ని పూర్తికి చర్యలు తీసుకుంటామని, గుంతలుగా ఉన్న ప్రాంతంలోకి ఎవ్వరూ పోకుండా సెక్యూరిటీని ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు మూలం ప్రసాద్, శ్రీనివాసులు, జాఫర్, ప్రసాద్, ఖాజా, మస్తాన్, సాయి, వహిదా పాల్గొన్నారు.

రెండో రోజూ స్కూల్ గేమ్స్



ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

మనుబోలు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం 69వ స్కూల్ గేమ్స్ మండలస్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో అండర్-14, అండర్ -17 విభాగాల కింద బాలురకు, బాలికలకు వేరువేరుగా వాలీబాల్, షటిల్, బాట్మింటన్, కబడ్డీ, ఖో ఖో పోటీలను స్కూల్‌గేమ్స్ మండల కో - ఆర్డినేటర్ మంజువాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఆటలపోటీలను సదరు పాఠశాల హెచ్‌ఎం అమూల్యకుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీడీలు శ్రీధర్, ప్రతిమ, మధుసూదన్‌రావు, మల్లికార్జున, ఏడుకొండలు పాల్గొన్నారు. నేటితో స్కూల్‌గేమ్స్ పూర్తయ్యాయని మంజువాణి తెలిపారు.

గంటల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు బాలుడు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలుడును పోలీసులు గంటల వ్యవధిలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల మేరకు.. నెల్లూరు నగరంలోని శాంతినగర్ వద్ద శుక్రవారం 12 ఏళ్ల బాలుడు ఏడుస్తూ సైకిల్ తొక్కుకుంటూ వెళుతుండటంతో స్థానికులు పట్టుకుని దర్గామిట్ట పోలీసులకు అప్పగించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్లకు విషయం తెలియడంతో ఆమె ఆదేశాల మేరకు బాలుడి తల్లిదండ్రులను గుర్తించేందుకు నగరంలోని అన్ని పోలీసు స్టేషన్‌ల సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆ బాలుడి తల్లిదండ్రులు కోటమిట్టలో ఉండగా పోలీసు స్టేషన్‌కు రప్పించారు. పడుగుపాడుకు చెందిన ఆ కుటుంబ సభ్యులు కోటమిట్టలోని తన అమ్మవారి ఇంటికి వచ్చారు. శుక్రవారం నమాజ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోగా ఇంట్లోని బాలుడు కనిపించలేదు. చుట్టపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. అదే సమయంలో దర్గామిట్ట పోలీసులు వారిని గుర్తించి బాలుడును అప్పగించారు. బాలుడును తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు



ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

సంగం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దువ్వూరు సమీపంలో ముంబయి జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం ఆటో బోల్తాపడడంతో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నై పట్టణానికి చెందిన ఓ ముస్లిం కుటుంబం సంగం మండలంలోని తరుణవాయిలో ఉన్న మస్తాన్‌బాబా దర్గా దర్శనానికి నెల్లూరులో బాడుగ ఆటో తీసుకుని బయలు దేరారు. మార్గమధ్యంలో దువ్వూరు సమీపంలో వెనుక వస్తున్న ఆటో ఢీకొన డంతో దర్గాకు వెళ్తున్న ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురికి గాయాలుకాగా సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు, ల్యాప్‌టాప్ చోరీ : కేసు నమోదు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కారు అద్దాలు పగులగొట్టి కారులోని నగదు, ల్యాప్‌టాప్ తదితర వస్తువులను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఏఎస్‌పేట మండలానికి చెందిన కీర్తి తన పిల్లల ఆరోగ్యం బాగలేక పోవడంతో గురువారం తన కారులో పొగతోటలోని ఓ వైద్యశాలకు తీసుకువచ్చారు. వైద్యశాలలో పిల్లలను చూపించుకొని మద్రాసు బస్టాండు వద్ద ఉన్న బాటాషోరూమ్‌కు వచ్చారు. కారును షోరూమ్ ఎదుట పార్క్ చేసి లోపలికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు కారు కుడివైపు వెనుక డోర్ అద్దాలు పగులగొట్టి లోపల ఉన్న రెండు ల్యాప్‌టాప్‌లు, పాస్‌పోర్టు, హ్యాండ్‌బ్యాగ్, ఫోన్, కాలి వెండిపట్టీలు, రూ.15 వేల దోచుకెళ్లారు. షోరూమ్ బయటకు వచ్చిన ఆమె కారు అద్దాలు పగులగొట్టి ఉండటం, లోపల వస్తువులు కన్పించకపోవడంతో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసుల ప్రత్యేక దృష్టి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు నేర నియంత్రణ, రోడ్డు ప్రమా దాల నివారణపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడపుతున్న 9 మందిపై కేసులు నమోదు చేశారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన 87 మందికి రూ. 33,135 జరిమానా విధించి, రెండు వాహనాలు సీజ్ చేశారు. రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. బహిరంగ మద్య సేవనం చేస్తున్న పది మందిపై కేసులు నమోదు చేశారు. జిల్లాలోని 31 లాడ్జీలను తనిఖీలు చేశారు. లాడ్జీల్లో గదిని అద్దెకు తీసుకునేవారి వివరాలను ప్రతిరోజు పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు పాల్గొన్నారు.

రైలు కిందపడి స్నేహితుల ఆత్మహత్యాయత్నం

- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఒకే చోట పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఇద్దరు స్నేహితులు రైలు కిందపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిత్తూరు జిల్లా పూతలపట్టుకు చెందిన జీ ఉమేష్ చంద్ర (24), పొదలకూరు మండలం తోడేరు పంచాయితీకి చెందిన పీ.వంశీలు నెల్లూరు నగరంలోని హరనాథపురంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఈనెల 17వ తేదీ రాత్రి స్నేహితులిద్దరు బర్త్‌డే పార్టీ అంటూ యజమాని వద్ద రూ.2 వేలు తీసుకుని బయటకు వచ్చారు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ గురువారం వెంకటేశ్వరపురం ఫ్లైవోవర్ బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. సంఘటనా స్థలంలోనే ఉమేష్‌చంద్ర మృతి చెందగా, అపస్మారక స్థితిలో ఉన్న వంశీని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. వంశీ కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారు నెల్లూరుకు చేరుకొని మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ వైద్యశాలకు తరలించారు. ఉమేష్‌చంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిచందన తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు

అనంతసాగరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాగరంలో కుక్కల బెడద ఎక్కువైంది. పీర్‌సాహెబ్‌పేట వద్ద ఒక బాలుడిపై కుక్క దాడి చేయగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల నిర్మూలన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తల్లి బాగోగులు పట్టించుకోని కొడుకు, కోడలిపై కేసు నమోదు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలైన తల్లి బాగోగులు పట్టించుకోకుండా నిరంతరం ఆమెను దుర్భాషలాడుతున్న కొడుకు, కోడలిపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం శ్రామికనగర్‌లో జయకుమారి తన కొడుకు సాత్విక్, కోడలితో కలిసి నివాసం ఉంటోంది. ఆమె భర్త గతేడాది అనారోగ్యంతో మృతి చెందాడు. కోడలు కొంతకాలంగా ఆమెకు అన్నం పెట్టకుండా దుర్భాషలాడుతుంటంతో కుమారుడు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో ఈనెల 14వ తేదీన ఆమె తన ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని కొడుకు, కోడలుకు చెప్పింది. దీంతో కోపోద్రిక్తులైన వారు ఆమెను నానా దుర్భాషలాడారు. ఈ మేరకు బాధితురాలు జయకుమారి శుక్రవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	138
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	272

కోడిగుడ్ల ధర (100): 560

శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : నగరంలోని కోదండరామపురంలోని మహాలక్ష్మీ ఆలయంలో దేవీనవరాత్రి ఉత్సవాలు ఆహ్వాన పత్రికలు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భగా ఆలయ ఛైర్మన్ పత్తి నరసింహం మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని తెలిపారు. ప్రతీరోజు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు విశేష పూజలు, నవావరణ, అష్టోత్తర సహస్ర నామ పూజలు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజూ వివిధ అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వాసిపల్లి నారాయణరెడ్డి, దామోదర్‌చంద్రమౌళీ, పత్తి శ్రీనివాసులు, తుమ్మల శ్రీనివాసులురెడ్డి, కాటేపల్లి వెంకటరమణయ్య, చిమ్మిరి గోవిందరాజులు, యర్రా రాఘవులు, మలుచూరి చంద్రారెడ్డి, పత్తి రాము, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు ఇరుకళల పరమేశ్వరి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట ఇరుకళల పరమేశ్వరి ఆలయం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం శనివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆలయ పాలక మండలి అధ్యక్షుడు ఒట్టూరు సుధాకర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి భక్తులు హాజరుకావాలని పేర్కొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ ఎంపికలు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నగరంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో శనివారం సాయంత్రం 5 గంటలకు స్కేటింగ్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు బీవీ.రమణయ్య, ఎం.దేవిక ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే చెముడుగుంట సమీపంలోని మాగుంటలేఅవుట్‌లో సైక్లింగ్ ఎంపికలను ఆదివారం ఉదయం 6 గంటలకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. క్రీడాకారులు సంబంధిత తేదీల్లో ఎంపికలకు హాజరు కావాలని తెలిపారు.

మైనార్టీ కార్పొరేషన్ ఎండీతో చర్చలు సఫలం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఎండీ ఏ.శేఖర్‌తో జిల్లాలోని క్రిష్టియన్ సమస్యలపై జరిగిన చర్చలు సఫలమయ్యాయని టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఉరందూరు సురేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పాస్టర్ల గౌరవ వేతనాలు, చర్చిల నిర్మాణాలు, మరమ్మతులు, బరియల్‌గ్రౌండ్స్ కమ్యూనిటీహాల్స్‌లతోపాటు పలు మైనార్టీ సంక్షేమ పథకాల గురించి చర్చించామని పేర్కొన్నారు. పాస్టర్ల జీతాలు త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఎండీని కలిసిన వారిలో క్రిష్టియన్ సెల్ జిల్లా కార్యదర్శి జీ.భరత్, జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఎం.జాషువా, జిల్లా కార్యదర్శి జూగుంట కిషోర్, తదితరులు ఉన్నారని తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మానసికంగా బాధపడుతున్న ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. డైకాస్‌రోడ్డు కుండల దర్గా వీధిలో షేక్ షంషాద్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె రెండో కుమారుడు సమీర్ ఏసీ కూరగాయాల మార్కెట్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పదేళ్లకిందట భార్య అతనిని వదలి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆయన మానసిక వ్యాధితో బాధపడుతూ వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమీర్ అదృశ్యమయ్యారు. బాధిత కుటుంబసభ్యులు అతని కోసం గాలించిన కన్పించకపోవడంతో శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిటీ ప్లానింగ్ విభాగంపై అవగాహన

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 19,(ఆంధ్రజ్యోతి) : సిటీ ప్లానింగ్ విభాగానికి సంబంధించి పలు అంశాలపై కార్పొరేషన్‌లో నిర్వహించిన ఓపెన్ ఫోరంలో 22 మందికి వారి అనుమానాలు నివృత్తి చేసినట్లు కమిషనర్ నందన్ తెలిపారు. భవన నిర్మాణ అనుమతులు, ఎల్ఆర్ఎస్‌ల పై అవగాహన కల్పించినట్లు చెప్పారు. కాగా పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ ముత్తుకూరు గేట్ ప్రాంతంలో పర్యటించారు. అక్కడ ప్రధాన డ్రైనేజీ కాలువను ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాలను గుర్తించిన ఆయన తక్షణం తొలగించాలని సిటీప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

దసరాకు ముందే పెన్షన్ చెల్లించాలి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : దసరా పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ పెన్షనర్లకు ఈనెల 28లోపే పెన్షన్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. బకాయిలు కూడా చెల్లించాలని, 12వ పీఆర్సీని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఐఆర్‌ను 40 శాతం ప్రకటించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లులను వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని డైకస్‌రోడ్డు, బోడిగాడితోట, ఎంజీ నగర్, పడారుపల్లి, ఏకేనగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతులు ఉన్నందున శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1వరకు సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ ఎం.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పై సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, ఈ అంతరాయాన్ని వినియోగదారులు గుర్తించి సహకరించాలని పేర్కొన్నారు.

నత్తే నయం!

- 15 నెలలుగా రైల్వే అండర్ పాస్ నిర్మాణం
- ఎనిమిది బ్లాక్స్‌లు సిద్ధం
- కేబుళ్ల మార్పు పనులు పెండింగ్
- గడువు పూరైనా పట్టించుకోని అధికారులు
- శెట్టిగుంటరోడ్డు, రంగనాయకుల పేట వద్ద నిర్మాణానికి శ్రీకారం


అండర్‌పాస్ కోసం సిద్ధం చేసిన బ్లాక్స్

నెల్లూరు(వెంకటేశ్వరపురం) సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని పాత పెన్నాబ్రిడ్జిని అనుకొని ఉన్న శెట్టిగుంటరోడ్డు రైల్వేగేటు ప్రాంతంలో అండర్‌పాస్ నిర్మాణం నత్తనడకన సాగుతుంది. రెండు రోడ్లతో అండర్‌పాస్ నిర్మాణం ప్రారంభించి దాదాపు 15 నెలలు కావస్తోంది. ఈ ఏడాది జూన్ కల్లా పూర్తి కావాల్సి ఉన్న ఈ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నగరంలో శెట్టిగుంటరోడ్డు, రంగనాయకులపేట ప్రాంతాల్లో రైల్వే అండర్ పాస్‌లు నిర్మాణాలు చేపట్టాయి. వీటి కోసం ఇప్పటికే రైల్వేశాఖ రూ.18 కోట్ల మంజూరు చేసింది. శెట్టిగుంటరోడ్డు అండర్‌పాస్‌కు రూ.11 కోట్లు, రంగనాయకులపేట వద్ద అండర్‌పాస్‌కు రూ.7 కోట్లను మంజూరు చేశారు. మొదట శెట్టిగుంటరోడ్డు అండర్‌పాస్ నిర్మాణం పూర్తిచేసి అనంతరం రంగనాయకులపేట వద్ద నార్మాణం చేపట్టనున్నట్లు రైల్వే అధికారులు స్పష్టం చేశారు.

● రైల్వే కేబుళ్ల మార్పు కోసం నిలిచిన పనులు

ఆర్‌వీఎన్ఎల్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న రెండు రోడ్లుతో రైల్వే అండర్‌పాస్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన ఎనిమిది బ్లాక్స్‌ను ఇంజనీరులు ఇప్పటికే సిద్ధం చేశారు. రైల్వే ట్రాక్ వద్ద అడ్డుగా ఉన్న కేబుళ్లను మార్పు చేసి బ్లాక్స్ పుషింగ్ ప్రక్రియ ద్వారా అండర్‌పాస్‌ను నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే రైల్వే లైన్లు మార్పు చేయాల్సిన పనులు ప్రారంభించక పోవడంతో అండర్‌పాస్ పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు పట్టించుకొని రైల్వే లైన్లు, కేబుళ్ల మార్పు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఐదో రోజూ కొనసాగిన పెన్‌డౌన్


రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖర్లు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : దస్తావేజు రిజిస్ట్రేషన్ విధానంలో ఓటీపీ, ఆటో మ్యూటేషన్‌కు సంబంధించి సాఫ్ట్‌వేర్‌లో లోపాలను సవరించాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖర్లు చేస్తున్న పెడ్‌డౌన్ కార్యక్రమం శుక్రవారం ఐదో రోజు కొనసాగింది. వందలాది మంది జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకొని తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేశారు. దీంతో జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరగక బోసి పోయాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది. ఈ సందర్భంగా జిల్లా దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్నం దుర్గేష్ బాబు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్‌లో ఉన్న లోపాలను సరిదిద్దాలని ఇప్పటికే రాష్ట్ర రిజిస్ట్రేషన్లశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందచేశామన్నారు. అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు సిటీ దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేబీవీ అశోక్, పంచాగ్నుల పవన్‌కుమార్, ఎండీ జమీరుద్దీన్, ములుమూడి బాలసుబ్రహ్మణ్యం, ఎండీ మజహరుద్దీన్, ములుమూడి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో యరగుడిపాటి జయంతి


చిత్రకూటం ఉత్సవానికి ముస్తాబైన శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయ తూర్పు రాజగోపురం కైంకర్య దాత యరగుడిపాటి వెంకటాచలం పంతులు జయంతి శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామిలకు చిత్రకూరం ఉత్సవం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

నారా లోకేష్‌తో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి భేటీ


మంత్రి నారా లోకేష్‌తో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : అమరావతిలో రాష్ట్ర ఐటీ, ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తన నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులకు సంబంధజంచిన పనులు శరవేగంగా సాగుతున్నాయి లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

వైద్య కళాశాలలపై వైసీపీ ఉద్యమం హాస్యాస్పదం

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్ రెడ్డి


మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య కళాశాలలపై వైసీపీ నేతలు ఉద్యమం చేపట్టడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేంద్రం స్పాన్సర్ స్కీమ్ కింద మూడు వైద్య కళాశాలలు ఉన్నాయన్నారు. మిగతా కళాశాలలు రాష్ట్ర బడ్జెట్‌లోనే నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. 2023లో అప్పటి వైసీపీ ప్రభుత్వం జీవో నెంబరు 108 విడుదల చేస్తూ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 100 శాతం వైద్య విద్య ఉచితమని చెప్పారని, ప్రారంభించిన తరువాత ఫీజులు నిర్ణయించి వైసీపీ ప్రభుత్వం సీట్లు అమ్ముకోలేదాని ప్రశ్నించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎన్ఆర్ఐ కోటా పెట్టింది అప్పటి వైసీపీ ప్రభుత్వమేనన్నారు. సీట్లు అమ్మితే నేనే అమ్మాలి అన్న జగన్ వైఖరి చూస్తుంటే వీరి పోరాటానికి పసలేదన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం జీవో నెంబర్ 108 ను రద్దు చెయ్యాలని కోరారు. ఓటు చోరీకి సంబంధించి రాహుల్ గాంధీ పక్కా ఆధారాలతో వెల్లడించారన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాలకు రూ.30 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు సంజయ్‌కుమార్, ఇర్ఫాన్, మల్లికార్జునరెడ్డి, నరేష్, అల్లాఉద్దీన్ రెహమాన్, సుజాత పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమానికి బయోమెట్రిక్


బయోమెట్రిక్‌ను ప్రారంభిస్తున్న జనార్దన్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు శుక్రవారం రాజరాజేశ్వరి ఆలయంలో అన్నదానం భక్తులకు బయోమెట్రిక్ విధానాన్ని జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. ఈకార్యక్రమం భక్తుల వివరాలు ద్వారా ప్రతీ శుక్రవారం జరుగుతోంది. బయోమెట్రిక్ ద్వారా 2వేల మందికి అన్నదానం కార్యక్రమం జరిగింది. ఉదయం రాజరాజేశ్వరికి రాహుకాల ఉద్వాపన పూజ, సాయంత్రం, సంధ్యామేళం, కుంభహారతులు, పల్లకీ ఉత్సవాలు జరిగాయి. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమాలను అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

పోషణ మహోత్సవాల్లో పురుషులు భాగస్వాములు కావాలి


వంటలను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

నెల్లూరురూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభమైన రాష్ట్రీయ పోషణ మహోత్సవాలు స్త్రీలతో పాటు పురుషుల భాగస్వామ్యం ఉండాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తెలిపారు. శుక్రవారం నగరంలోని మైపాడు గేట్ వద్ద స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆ శాఖ సూపర్‌వైజర్ లక్ష్మీరాజ్యం ఆధ్వర్యంలో స్త్రీలు, పురుషుల మధ్య వంటల పోటీలు నిర్వహించారు. తయారు చేసిన వంటలను ఆమె పరిశీలించారు. అలాగే 12వ డివిజన్ పరిధిలోని అల్లీపురం మేకలవారితోట వద్ద ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీ శకుంతల మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విజయవాడ (గాంధీనగర్), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే నిరసన కార్యక్రమాలు చేపడతామని ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ ఎండీ.పాషా స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని గురువారం సచివాలయంలో కలిసి ముందస్తు నోటీసు అందజేశారు. సచివాలయ ఉద్యోగులకు వలంటీర్ల విధుల నుంచి విముక్తి కలిగించాలని, మాతృశాఖ, ఇతర శాఖల్లో విలీనం చేయాలని మంత్రిని కోరారు. నోషనల్ ఇంక్రీమెంట్లు మంజూరు చేయాలని, ఆరేళ్ల ఒకే క్యాడర్‌లో పని చేసిన ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కల్పించి పే స్కేల్ అమలు చేయాలని కోరారు.

నగరంలో ఓ మోస్తరు వర్షం


నగరంలో రోడ్లపై పారుతున్న వర్షపు నీరు

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శుక్రవారం భారీ మెరుపులు, పిడుగులతో పడిన వర్షానికి నగరవాసులు బీతిల్లిపోయారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు ఏకదాటిగా వర్షం పడుతూనే ఉండటంతో కార్యాలయాల నుంచి ఇళ్లకు రావాల్సిన ఉద్యోగులు, సిబ్బంది, స్కూల్ పిల్లలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పైగా వర్షం తాకిడికి రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

దూదేకుల రిజర్వేషన్ ఇతరులకు వర్తింపచేయొద్దు


కలెక్టర్‌కు వినతిపత్రం అందచేసి సత్కరిస్తున్న దూదేకుల సంఘం నాయకులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముస్లిం-దూదేకులకు బీసీ-బీ రిజర్వేషన్ ఉందని, ఈ రిజర్వేషన్‌ను ఇతరులు వినియోగించుకోకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్‌బాషా-దూదేకుల బీసీ ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కే.బాబర్‌జాన్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం సమర్పించారు. కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బాబర్‌జాన్ మాట్లాడుతూ బీసీ-ఈలో ఉన్న ముస్లిం మైనార్టీలు కొందరు బీసీ-బీ సర్టిఫికెట్ పొంది రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తున్నారన్నారు. అలా వినియోగించుకోకుండా తహసీల్దార్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఖాదర్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజామస్తాన్, షేక్ చిన్నమస్తాన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

జాషువా జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

పద్మభూషణ్ గుర్రం జాషువా జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ గుర్రం జాషువా గ్రంథాలయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ ఖాసీం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం సమర్పించారు. ఖాసీం మాట్లాడుతూ ఈనెల 27న జాషువా జయంతి అని, ఆ రోజు సెలవుదినంగా ప్రకటించాలని కోరారు.

ఉత్సాహంగా తెలుగు పద్యాల కంఠస్థ పోటీలు


తెలుగు పద్యం చెబుతున్న చిన్నారి

నెల్లూరు(సాంస్కృతికం) సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట అన్నదేవుల గోవింద రెడ్డి, సరస్వతి సమాజంలో శుక్రవారం 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులకు తెలుగు పద్యాల కంఠస్థ పోటీలు జరిగాయి. ఈ పోటీలను ప్రారంభించిన సమాజం అధ్యక్షుడు మోహూరు పెంచలయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మాతృభాష తెలుగు పట్ల ఆసక్తి పెంచేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఆంగ్లభాష వ్యామోహంలోకి పంపకుండా తెలుగు పద్యాలు, పాఠాలు నేర్పించాలన్నారు. 1వ తరగతి నుంచి హైస్కూల్ విద్య వరకు ప్రభుత్వ నిర్బంధ తెలుగు బోధన అమలు చేయాలని కోరారు. విజేతలకు సోమవారం బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు బీ.రమణయ్య, మల్లెల శ్రీహరి, కె.వెంకటస్వామిరెడ్డిలు వ్యవహరించారు. కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వర్లు, ఎస్.కోటేశ్వరరావు, క.శ్రీనివాసులు, నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోండి

● పారిశుధ్య కార్మికుల ఆందోళన

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన మాట ప్రకారం సమ్మెకాలంలో జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సంఘ నేత పెంచలనరసయ్య, శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల డిమాండ్ల సాధనకోసం జూలైలో 15 రోజులు సమ్మె చేపట్టామన్నారు. పారిశుధ్య విభాగంలో టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు, సమ్మెకాలంలో జీతాలు కూడా చెల్లిస్తామని చెప్పారన్నారు. కానీ అవేమి జరగలేదని, వాటిపై ప్రశ్నిస్తే కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 45 రోజుల సమ్మెకాలంలోని జీతాలను వెంటనే ఇచ్చారని తెలిపారు. ఇప్పుడెమో ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే ఇస్తామని చెప్తున్నారని వాపోయారు. ఇచ్చిన హామీ మేరకు ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు.


ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

త్రీఫేస్ పనులను త్వరితగతిన పూర్తి చేయండి


త్రీఫేస్ పనులను పరిశీలిస్తున్న రమణాదేవి

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాలకు 24 గంటలు విద్యుత్ సరఫరా అందించే త్రీఫేస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ రమణాదేవి అధికారులను ఆదేశించారు. రూరల్‌లోని పొట్టేపాళెం, దేవరపాళెం, కొమ్మరపూడి, సిద్దీపురం, నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతాల్లో ఆమె శుక్రవారం పర్యటించి త్రీఫేస్ పనులతో పాటు కంటైనర్ సబ్‌స్టేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా రూ.400 కోట్లతో గ్రామాలకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఆ పనులు త్వరలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆదునిక సాంకేతికతో ఎస్పీడీసీఎల్‌తో మెట్టమెదటి కంటైనర్ సబ్‌స్టేషన్ నగరంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు రాజేంద్రప్రసాద్, పరంధామయ్య, భానునాయక్, శ్రీధర్, లక్ష్మీనారాయణ, రమేష్ చౌదరి, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు ఎక్కువగా ఉంచుకోవద్దు : డీఎంహెచ్‌వో


స్థానికులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు నీటి నిల్వలు ఎక్కువగా ఉంచుకోవద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత వెల్లడించారు. శుక్రవారం నగరంలోని కిసాన్‌నగర్, రాజీవ్‌నగర్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పర్యటించారు. కాలువలో దోమల నివారణకు మందు స్ప్రే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. డ్రై డే ఆవశ్యకత గురించి చెబుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మలేరియా నివారణ జిల్లా అధికారి హుస్సేన్ నమ్మ మాట్లాడుతూ వర్షాలు పడినప్పుడు నీటి నిల్వలు ఎక్కువగా ఉండడం ద్వారా దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. అందువలన నిల్వ నీటిలో దోమల లార్వాను పరిశీలించి నీటిని ఒలక పోయాలన్నారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, బోధవ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్‌బాబు, సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు, శాంసన్‌బాబు, సూపర్‌వైజర్ శ్రీధర్, ఆరోగ్య సహాయకులు నందకుమార్. సంజీవులు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన
ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Nellore-3 బ్రాంచి మేనేజర్ వారు ... [illegible]
SCHEDULE
[illegible]
Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

బహిరంగ ప్రకటన
ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Nellore-3 బ్రాంచి మేనేజర్ వారు ... [illegible]
SCHEDULE
[illegible]
Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

బహిరంగ ప్రకటన
ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Gudur బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన బోగొట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది Sri Karipaka Muni Vara Prasad S/o. Molakaiah, Rajiv Nagar, Muthukur (V&M), SPSR Nellore District గారికి ... [illegible]
SCHEDULE
SPSR Nellore Dt., Nellore regn. dt- Muthukur sub-regn. dt.,- house and house site in an extent of 440 sq.ft Rcc house, 300 sq.ft Rcc shop, 188 sq.ft Acc shop room, 132 sq.ft Acc Kitchen room and 132 sq.ft ACC bath room in ground floor and 280 sq.ft Rcc house 143 Acc roofed house and 60 sq.ft Acc bath room and lavotary in 1st floor in 25 ankanams or 200 sq.yards site and out of it 1/3rd share i.e. 833 ankanams or 66.66 sq.yards site and 1/3rd share in the above house in door No.1-276, near Navarang theatre, Krishnapatnam main road, covering Sy. No.268 of Muthukur Village and Mandal, Municipality and bounded by: East: Site of Pidimarri Ramu to some extent and site of Nellore Balamma to some extent, South: House of A.V.Krishnaiah, West: Main road from Nellore to Krishnapatnam, North: House of Mamidala Srinivasulu.
P.Bhaskar Rao, B.Sc., B.L., Advocate, 13/26, Kummari Street, Gudur

బహిరంగ ప్రకటన
ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Venkatagiri బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన బోగొట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది ... [illegible]
SCHEDULE
[illegible]
Tayi Vijayakumar, B.Com., B.L., Advocate, Teachers Colony, Venkatagiri. Cell:9440507929

వరుణదేవా.. రావొద్దు స్వామీ!

రోడ్ల పక్కన ధాన్యపు రాశులు

ఆందోళనలో అన్నదాతలు

కోవూరు పరిసర గ్రామాల్లో పలు చోట్ల శుక్రవారం వర్షం పడటంతో అప్పుడే కోసిన వరిధాన్యం తడిసిపోయింది. పొలం నుంచి వరి కోత యంత్రం ద్వారా వెలుపలికి వచ్చిన ధాన్యం తడవడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. వెంటనే టార్పాలిన్ పట్టల్ని కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. పలుచోట్ల వరికోత యంత్రాల్లో చేరిన వరిధాన్యం తడవడంతో మిల్లర్లు ధాన్యాన్ని తమ వెంట లారీల్లో తీసుకువెళ్ళేందుకు నిరాకరించారు. రైతుల అభ్యర్థన మేరకు ధర తరువాత చెబుతామంటూ ధాన్యాన్ని తరలించారు. కోవూరు, గంగవరం, పాటూరు, మోడేగుంట, వేగూరు గ్రామాల్లో ధాన్యంలో నెమ్ముశాతం తక్కువగా ఉందని గట్లపైనా, రోడ్ల పక్కనే వదిలేసి వెళ్ళారు. పొలాల్లో కల్లాలు లేకపోవడంతో ధాన్యం వర్షానికి తడవకుండా పట్టలు కప్పి రైతులు జాగ్రత్తలు తీసుకున్నారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)



ప్రకృతి వైపరీత్యాల్లో ప్రజలను కాపాడటమే ప్రథమ కర్తవ్యం : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలను కాపాడటమే జిల్లా యంత్రాంగం ప్రథమ కర్తవ్యం కావాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. కలెక్టరేట్ శంకరన్ హాల్లో శుక్రవారం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సురక్షితంగా కాపాడేందుకు ముందస్తు ప్రణాళిక అవసరమన్నారు. వైద్యశాలలు, తదితర వివరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అధికారులందరూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ పాల్గొన్నారు.



ఇది.. కూడా రోడ్డేనట!



గుంతలుమిట్టలుగా పైచిత్రంలో కనిపిస్తున్నది రోడ్డునట. దీనిపై నిత్యం వాహనచోదకులు అవస్థలు పడుతూ ముందుకుసాగుతున్నారు. అనంతసాగరం మండలం సోమశిల ప్రధాన రహదారికి పట్టిన గతి ఇది. ఉప్పలపాడు నుంచి సోమశిల వరకు రోడ్డుపై మోకాలు లోతు గుంతలు ఉన్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు దుస్థితిని గమనించి, అధికారులు మరమ్మతులు చేయించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

'పర్యాటకం'పై బకాయిల బండ!

- ఉమ్మడి జిల్లాలో 9చోట్ల బీచ్ రిసార్ట్స్
- నిర్వహణ అంతా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి
- ఏళ్ల తరబడి వసూలుకాని అద్దెలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్వహణ లోపం కారణంగా జిల్లాలో పర్యాటక అభివృద్ధి పడకేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన బీచ్ రిసార్ట్స్‌ను ఆ సంస్థ ప్రైవేటు వ్యక్తులకు లీజుకి ఇచ్చి, పర్యాటకులకు సేవలు, సౌకర్యాలు అందించడం మానుకుంది. లీజుకి తీసుకున్న ప్రైవేటు వ్యక్తులు పర్యాటకులకు సరైన వసతులు కల్పించకుండా అధిక ధరలు వసూలు చేసుకుంటూ ఆ సంస్థకు లీజు బకాయిలు చెల్లించడంలేదని తెలిసింది. ఆ లీజు బకాయిలు ఇప్పుడు రూ.80 కోట్లకుపైగా పేరుకున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో జిల్లాస్థాయి అధికారులు బీచ్ రిసార్ట్‌ల (ప్రైవేటు) యజమానుల అక్రమాలకు తలలు ఊపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రిసార్ట్స్‌లకు రూ. కోట్ల వ్యయం

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 9 బీచ్ రిసార్ట్స్‌ను ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ రూ.కోట్లు వ్యయం చేసి నిర్మించింది. ఆ సంస్థ వాటిని నిర్వహించకుండా ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చింది. లీజులు వసూలు కాక బకాయిలు పేరుకుపోయాయి.

- **మైపాడు బీచ్ రిసార్ట్ :** హోటల్ కం బార్‌ను 15 ఏళ్లకు లీజుకి ఇచ్చింది. నెలకు రూ.2.50లక్షలకు లీజుదారుడు పర్యాటకాభివృద్ధి సంస్థకు చెల్లించాలి. లీజుకు తీసుకున్నప్పటి నుంచి ఆ వ్యక్తి సక్రమంగా చెల్లించడంలేదు. కాగా విద్యుత్ శాఖకు రూ.2.50 లక్షలు కరెంటు బిల్లు బకాయి పెట్టడంతో 15రోజులకుపైగా విద్యుత్‌ను ఆ శాఖ కట్ చేసింది. మైపాడు బీచ్, రిసార్ట్, హోటల్, బార్ల నిర్వహణ అత్యంత అధ్వానంగా ఉందని పర్యాటకులు చేసిన ఫిర్యాదుపై జిల్లా స్థాయి అధికారి పరిశీలించి లీజుదారుడికి గట్టి హెచ్చరికలు చేశారు.
- 2023లో కొత్త కోడూరు బీచ్ రిసార్ట్స్‌ను నెలకి రూ.50వేలు చొప్పున లీజుకి ఇచ్చింది. 2024లో ఇస్కపల్లి బీచ్, రామతీర్థం రిసార్ట్సును 15 ఏళ్లకు, 2009లో తుమ్మలపెంట బీచ్, రిసార్టును 33 ఏళ్లకు లీజుకి ఇచ్చారు. ప్రతి నెలా రూ.1.30 లక్షలు చెల్లించాలి. నెలనెలా లీజు మాత్రం చెల్లించడంలేదు. ఏటా లీజును 5 శాతం పెంచాలి.
- రామాయపట్నం బీచ్ రిసార్ట్స్‌ను 2022లో 1 ఏళ్లకు లీజుకి ఇచ్చారు. లీజుకి తీసుకున్న వ్యక్తి నెలకి రూ.95వేలు లీజు చెల్లించాలి. అయితే లీజును సక్రమంగా చెల్లించడంలేదని తెలిసింది.
- నేలపట్టు బీచ్ రిసార్ట్‌ను నెలకి రూ.73వేలు లీజు చొప్పున 2022లో 15 ఏళ్లకు ప్రైవేటు వ్యక్తులకు లీజుకి ఇచ్చారు. సక్రమంగా లీజు చెల్లించకపోగా వేరే వ్యక్తికి యోగా కేంద్రం సబ్ లీజుకి ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు.
- 2022లో దొరవారిసత్రం బీచ్ రిసార్టును ప్రైవేటు వ్యక్తులకు నెలకి రూ.97వేల చొప్పున అద్దెకు 15 ఏళ్లపాటు పర్యాటకాభివృద్ధి సంస్థ లీజుకి ఇచ్చింది. లీజులు మాత్రం సక్రమంగా వసూలు కావడంలేదు.
- బీవీపాలెం బీచ్ రిసార్టును 2023లో నెలకి రూ.2లక్షలు అద్దె ప్రాతిపదికన 20 ఏళ్లకు లీజుకి ఇచ్చారు.

ఈ బీచ్ రిసార్టుల్లో వీకెండ్, ఇతర ప్రత్యేక దినాలతోపాటు ప్రతి రోజూ పర్యాటకులు విడిది చేస్తున్నారు. వ్యాపారం సాగుతున్నా లీజుదారులు మాత్రం సక్రమంగా నెలవారీ అద్దెలు చెల్లించలేదు. దీంతో బకాయిలు పేరుకుపోయాయి. దాదాపు రూ.80కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచింది.

● తాగాజా ప్రైవేటుకు 'హరితా'

తాజాగా రాష్ట్రంలోని 23 హరితా హోటళ్లను ప్రైవేటు పరం చేసేందుకు ఆ సంస్థ ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇందుకుగాను ఆ సంస్థ రూ.150కోట్లు అప్పు చేసి హరితా హోటళ్లను మరమ్మతులు చేస్తున్నారు. అయితే లీజుల బకాయిల వసూళ్లపై ప్రభుత్వం పెద్దలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



మైపాడు బీచ్ రిసార్ట్ (ఫైల్)



రామాయపట్నం బీచ్ రిసార్ట్ (ఫైల్)

హ్యాపీ బర్త్‌డే సురేష్!

ఎమ్మెల్యే కాకర్లకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం, మంత్రులు

ఉదయగిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అమరావతిలోని శాసనసభ మందిరంలో సురేష్‌కు మిఠాయిలు తినిపించారు. అలాగే మంత్రి నారా లోకేష్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



దరఖాస్తు చేసుకుంటారా.. ధ్వంసం చేయమంటారా!?

- 'ఎల్ఆర్ఎస్'పై ఇంత లెక్కలేనితనమా!?
- అక్రమ లేఅవుట్లపై ఇక ఉపేక్షించే ప్రసక్తే లేదు!
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపైనా చర్యలు
- నుడా ఛైర్మన్ కోటంరెడ్డి ఆగ్రహం

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 'జిల్లాలో అక్రమ లేఅవుట్ దారులు లెక్కలేనితనంగా వ్యవహరిస్తూ క్రమబద్ధీకరణకు (ఎల్ఆర్ఎస్) ముందుకు రావడంలేదు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.' అని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని నుడా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీతో అవకాశం కల్పించదన్నారు. అయితే దీనిని రియల్టర్లు వినియోగించుకోవడం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 14శాతం మార్కెట్ విలువను చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాల్సి ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రతి ఒక్కరికి మేలు జరగాలన్న ఉద్దేశంతో 7శాతం మార్కెట్ విలువ చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. అయితే జిల్లాలో 437 అక్రమ లేఅవుట్లు ఉండగా, కేవలం 23 లేఅవుట్ల యజమానులు మాత్రమే క్రమబద్ధీకరణకు ముందు కు వచ్చారని తెలిపారు. ఇంకా 414 లేఅవుట్ల యజమానులు దరఖాస్తులు చేసుకో కుండా, లెక్కలేని తనంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తమకు ఎవరో ఒకరి అండ ఉం టుందన్న ధీమాతో నిర్లక్ష్యంగా ఉంటున్నారని, అలాంటి వారిని ఇక ఉపే క్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇక నెల రోజులు మాత్రమే గడువు ఉందని, ఈ లోపు దరఖాస్తులు చేసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి లేఅవుట్‌ను ధ్వంసం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మరోసారి ఎల్ఆర్ ఎస్‌కు అవకాశం ఉండదని తెలిపారు. అక్రమ లేఅవుట్లు వేయకుండా కఠినంగా వ్య వహరిస్తుంటే విండమూరు, వరికుంటపాడు మండలాల్లో కొంతమంది అక్రమ లేఅ వుట్లు వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. తమను ఎవరో ఒకరు కాపాడుతారన్న ధైర్యంతో ఉంటున్నారని, అలాంటివారిపై తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. అలాగే అక్రమ లేఅవుట్లకు విద్యుత్ సౌక ర్యం కల్పించిన ఏఈలు, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామన్నారు. నుడా పరిధిలో అక్రమ లేఅవుట్లకు నోటీసులు ఇవ్వమంటే చాలాచోట్ల పంచాయతీ కార్యదర్శులు యజమానుల చిరునామాలు తెలియవంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వారందరిపై చర్యలు తప్పవ న్నారు. ఇప్పటికైనా లేఅవుట్ల యజమానులు మర్యాదగా దరఖాస్తు చేసుకోవాలని, లేదంటే ఆ లేఅవుట్లకు భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నుడా అధికారులు పెంచల్‌రెడ్డి, హిమబిందు, ఖాలేషా తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కోటంరెడ్డి

ఈసీ, టీఏలపై ఏపీడీ ఆగ్రహం

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయంలో విచక్షణ మరిచి బూతులు తిట్టుకున్న ఈసీ హజరత్తయ్య, సాంకేతిక సహాయకుడు సునీల్‌పై ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ మృదుల శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వారు కార్యాలయంలో బూతులు తిట్టుకుంటూ తీవ్ర వాగ్వివాదానికి దిగడంపై వివిధ పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో డ్వామా పీడీ గంగాభవాని విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని సూచించడంతో వారిని ఏపీడీ కావలికి పిలిపించి విచారణ జరిపినట్లు సమాచారం. ఈమేరకు వారిని ఆమె తీవ్రంగా మందలించి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

జడ్పీ ఛైర్‌పర్సన్ వస్తున్నారనీ..

● విద్యార్థులతో వెట్టిచాకిరీ

జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కావలిలోని ముసునూరు పాఠశాల సందర్శన కు వస్తున్నారని తెలిసింది. అంతే.. ఉపాధ్యాయులు ఏర్పాట్లకు పూనుకున్నారు. విద్యార్థులతో పాఠశాల గదులను శుభ్రం చేయించారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఆ తర్వాత వెళ్లిన అరుణమ్మకు ఈ విషయం తెలిసి టీచర్లను మందలించారు.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)



గదిని శుభ్రం చేసి నీటిని కింద పోస్తున్న విద్యార్థి

వేడుకగా మస్తాన్‌వలి గంధమహోత్సవం



దర్గాలో కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ, పక్కన ఏఆర్ రెహమాన్



భక్తులకు గంధాన్ని పంచిపెడుతున్న దర్గా ముజావర్లు

వెంకటాచలం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కసుమూరులోని మస్తాన్ వలి 248వ గంధమహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం అర్ధరాత్రి బంగ్లా (చందన్ మహల్)లో గంధాన్ని ఉంచి ముజావర్లతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం గంధాన్ని గుర్రంపై ఉంచి, సంప్రదాయ వాయిద్యాలైన మేళతాళాలు, ఫకీర్ల జర్బ, కొమ్ము బూర వంటి వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. గుర్రాన్ని మొక్కేందుకు భక్తులు పోటీ పడ్డారు. శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో దర్గా వద్దకు గంధం చేరింది. అనంతరం మస్తాన్‌వలి సమాధిపై పూల చద్దర్లు, దుప్పట్లను కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ సిజారా (వంశస్థుల పేర్లు) చదివి, గంధాన్ని స్వామి సమాధికి పూశారు. అనంతరం దర్గా ముజావర్లు గంధాన్ని భక్తులకు పంచి పెట్టారు. పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. విద్యుత్, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య శాఖ భక్తతలకు విస్తృత సేవలు అందించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు, వెంకటాచలం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో భారీ పోలీ స్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

● ఏఆర్ రెహమాన్ ప్రార్థనలు

ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ గంధమహోత్సవంలో పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన్ను చూసేందుకు భక్తులు పోటీ పడ్డారు. అనంతరం కడప పీఠాధిపతితో కలిసి వెళ్లి స్వామివా రి సమాధికి గంధం పూశారు. జిల్లా అడిషనల్ ఎస్పీ సౌజన్య కూడా దర్గాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

● నేడు చిన్న గంధం

శనివారం ఉదయం గ్రామంలో చిన్నగంధం జరుగుతుందని జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖుదావన్, దర్గా ఈఓ షేక్ షరీఫ్, కేర్ టేకర్ పఠాన్ అస్లాం ఖాన్ వెల్లడించారు. కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ చిన్న గంధానికి (తహలీల్ ఫాతెహా) చదివింపులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

శ్రీ దుర్గా భవాని జ్యోతిష్యాలయం

స్త్రీ, పురుషుల వశీకరణ, కుటుంబ, చదువు, పెళ్లి, ప్రేమ, భార్యా భర్తల మధ్య సమస్యలు, నాగదోషం ఎలాంటి సమస్యలు ఉన్నా చెప్పబడును. శ్రీ దుర్గ హోటల్ ఎదురుగా, స్టోన్‌హౌస్‌పేట, సెల్:97042 49338

AJR-240728

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఏఎస్‌పేటకు పోటెత్తిన భక్తజనం



ఏఎస్‌పేటలో గంధ లేపనం చేస్తున్న మత పెద్ద

ఏఎస్‌పేట : శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా 252వ గంధమహోత్సవాన్ని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహల్‌లో మహిళలు దంచి తయారు చేసి గంధంకు సుగంధ తైలాలు కలిపి కలశాలలో నింపారు. అనంతరం దర్గా ఈవో మహమ్మద్ హుస్సేన్ సమక్షంలో కలసాన్ని దర్గా సజ్జాద షాగులంమ్ నక్షబంద్ ఫయాజ్ అహ్మద్ తలపై ఎత్తుకొని ఊరేగింపుగా దర్గాకు తరలించారు. దర్గాలోని నాయబ్ రసూల్ స్వామి సమాధికి లేపనం చేసి, స్వామి,అమ్మవార్ల సమాధులపై గలేఫాలు, పూల దుప్పట్లు కప్పి ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మెయిన్ బజారులోని రాజా బాలాజీ, రాజా శ్రీనివాసులు, రాజా సుధీర్‌ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా బస్టాండ్ సెంటర్, బజారు వీధి తదితర ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో చిరాగా

గంధమహోత్సవంలో భాగంగా భక్తిశ్రద్ధలతో చిరాగా (దీపారాధన) కార్యక్రమన్ని నిర్వహించారు. దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ దర్గా ప్రాంగణంలోని కోనేరును ప్రత్యేకంగా దీపాలతో అలంకరించారు. అనంతరం దర్గాలో దీపాలు వెలిగించారు. భక్తులు కూడా నూనె, మైనం దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



దీపాలతో అలంకరించిన కోనేరు

ఇక క్రీడా సంబరం!

- ప్రతిష్టాత్మకంగా సంసద్ ఖేల్ మహోత్సవ్-2025
- క్రీడా సంస్కృతిని పెంపొందించి ప్రోత్సహించడమే లక్ష్యం
- జిల్లాలో 100 రోజులపాటు నిర్వహణ
- ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సంసద్ ఖేల్ మహోత్సవ్ 2025.. యువత క్రీడలు, ఫిట్‌నెస్ ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వందరోజుల కార్యక్రమం. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో ఎంపీలతో నిర్వహించే ఈ కార్యక్రమంలో గ్రాస్‌రూట్‌స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం, ప్రతిభ కలిగిన యువతను గుర్తించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతోపాటు ఫిట్‌నెస్ అలవాట్లను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశంగా నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 29న కేంద్రం ఈ కార్యక్రమాన్ని ప్రకటించింది. అన్ని రకాల క్రీడలతోపాటు సామూహికంగా పాల్గొనే సరదా క్రీడలను నిర్వహించనున్నారు. దీనికోసంగా జిల్లాలో ఇప్పటికే విద్యా, క్రీడాశాఖ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ కార్యక్రమ నిర్వహణ, ఏర్పాట్లపై చర్చిస్తున్నారు. క్రీడా సంఘాలు, ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులతోపాటు కోచ్‌లను, స్థానికులను సంసిద్ధం చేస్తున్నారు. గ్రామ, పంచాయతీ, వార్డు, కార్పొరేషన్, పార్లమెంట్ నియోజకవర్గం, డివిజన్, జిల్లాస్థాయిల్లో పోటీలను నిర్వహించనున్నారు. అన్ని రకాల వసతులతో పోటీలను నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నారు.



● నమోదుకు ప్రత్యేక పోర్టల్

క్రీడల్లో పాల్గొనేందుకు ప్రత్యేకంగా సన్‌సద్‌ఖేల్‌మహోత్సవ్ డాట్ ఇన్ పేరుతో అధికారిక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. దరఖాస్తులు పూర్తయిన వెంటనే (100 రోజులు) క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ఎప్పటి కప్పుడు క్రీడాపోటీలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడంతోపాటు ఉత్తమ క్రీడాకారుల జాబితాలను సిద్ధం చేస్తారు. కబడ్డీ, ఖోఖో, రెజ్లింగ్ వంటి వాటితో పాటు ప్రముఖ క్రీడలైన ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్, యోగా, టేబుల్ టెన్నిస్, హాకీ వంటి క్రీడల పోటీలు నిర్వహిస్తారు. జిల్లా పరిస్థితులు, కార్యక్రమాల నిర్వహణకు అనుగుణంగా పోటీల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని అధికారులు పేర్కొన్నారు.

నేటి నుంచి అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

ఆత్మకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో శనివారం నుంచి రెండు రోజుల పాటు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి వరకుమారి, పీడీ సిరిమావిళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో భాగంగా కబడ్డీ, చెస్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించబడతాయన్నారు. ఈ పోటీల్లో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలు పాల్గొంటాయని పేర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10511
వెండి కిలో ధర	రూ. 1,33,800
వెండి ఒక గ్రాము	రూ. 136.80

న్యూస్ బాక్స్

వైద్యశిబిరం పరిశీలన



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

సంగం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరిమెర్ల, తలుపూరుపాడులో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని జిల్లా అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో ఖాదర్‌వలీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య శిబిరంలో ప్రజలకు అందచేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

ఉదయగిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమగ్ర విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో-1 టీ.వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం మండలంలోని గుడినరవ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల ప్రగతి సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి వివాదంపై కేసు నమోదు

వింజమూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హెచ్‌పీ పెట్రోలు బంకు ఎదురుగా స్థలం దారి వివాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రతాప్ తెలిపారు. ఆ స్థలం దారి విషయమై కాలనీవాసులకు స్థల యజమాని సుబ్బారెడ్డికి వివాదం నడుస్తున్న వలన ముళ్ల కంచెను ధ్వంసం చేశారని సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలు



ఉదయగిరిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



వరికుంటపాడులో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను శుక్రవారం టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్నలు టీడీపీ నాయకులతో కలిసి కేక్‌కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. అలాగే కాకర్ల చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక అల్తూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినేందుకు 400 ప్లేట్లు పంపిణీ చేశారు. స్టేట్‌పేట చిల్డ్రన్‌హోమ్ చిన్నారులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, గడ్డం వెంకటేశ్వర్లు, నల్లిపోగు నరసింహ, బొజ్జా శ్రీనివాసులు, ఏడుకొండలు, ఓబులరెడ్డి, సందానీ, శివకృష్ణ, సర్ఫుద్దీన్, జల్సాయాదవ్, హరీష్ పాల్గొన్నారు.

మన్నేటి ఆధ్వర్యంలో...

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి సూచన మేరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంతుజానీ, మట్ల లక్ష్మయ్య, బాబు, నారాయణరెడ్డి, జ్యోతి, అంకయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

●దుత్తలూరు(ఉదయగిరి): స్థానిక కమ్మవారిపాళెం సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కాకర్ల జన్మదిన వేడుకలను మండల టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నంలు టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకర్ల మధు, చీదర్ల మల్లికార్జున, చల్లా ప్రసాద్, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో వింజమూరులోని పార్టీ కార్యాలయానికి తరలివెళ్లి కాకర్లను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, గొడుగులూరి మాల కొండ్రాయుడు, ఆంద్రా బాలగురవారెడ్డి, మూలె వీరారెడ్డి, పొద మాధవరావు, నాదిండ్ల రాజేంద్ర, పోక మహేశ్వరరావు, చంద్ర వెంకయ్య, తెల్లగొర్ల వెంకటయ్య, జనసేన మండల కన్వీనర్ పఠాన్‌రసూల్, ఆవుల అరుణ, ఆరికొండ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

●సీతారామపురం: మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల టీడీపీ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పుటినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు భారీ కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచిసంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యకుమారి సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్, ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ బాబు, ముత్తంశెట్టి కృష్ణ, చంద్రరెడ్డి, కాశీరత్తయ్య, సిద్దయ్య, తిరుపతయ్య, తోట ఏడుకొండలు, బండిరవి, ఖాజామొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

పోటాపోటీగా మండలస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

సంగం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలు శుక్రవారం పోటాపోటా జరిగాయి. ఈ పోటీలను ఉప విద్యాశాఖాధికారి జానికీరామ్ ప్రారంభించారు. పరుగుపందెం, డిస్కత్రో, షాట్ పుట్, లాంగ్‌జంప్‌లో పోటీల్లో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సంగం ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, స్కూల్ గేమ్స్ కార్యదర్శి బివి రమణయ్య, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఆర్వో రామ్మోహన్

ఉదయగిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎల్ రామ్మోహన్ కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తహసీల్దారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 323 పోలింగ్ కేంద్రాల పరిధిలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి ఓటుహక్కు కల్పించడంతోపాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నీహా, రాజకీయ పార్టీల నాయకులు బయ్యన్న, వెంకటేశ్వర్లు, తహసీల్దారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి



క్షేత్ర దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

ఆత్మకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని అడిషనల్ డీపీఎం మునిరత్నం సూచించారు. ఈసందర్భంగా శుక్రవారం మహిమలూరుకు చెందిన రైతు ఇరగన శ్రీనివాసులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న పంటలను పరిశీలించి ఆత్మకూరు ఏవో కె కిషోర్‌బాబు ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారులు మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకుని నికర ఆదాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పొదలకూరు, కోవూరు, ఆత్మకూరు, నెల్లూరు, ఉదయగిరి తదితర సబ్ డివిజన్ పరిధిలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయశాఖ అధికారులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యంసీసాల ధ్వంసం



ధ్వంసం చేసిన మద్యం సీసాలను పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉయగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో 2019 నుంచి ఇప్పటివరకు వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను శుక్రవారం కార్యాలయ సమీపంలో ఆ శాఖ అధికారి శ్రీనివాసులనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేసినట్లు సీఐ లక్ష్మణస్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 151 కేసుల్లో 2,153 మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ దీప్తికరంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



ఆర్డీవో పావనికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ఆత్మకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సీపీఐ, సీపీఎం, అనుబంధ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఆర్డీవో బి పావనికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి జంగం నాగరాజు, సీపీఎం నాయకులు కె డేవిడ్‌రాజు, ఆత్మకూరు నాగయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సందాని తదితరులు మాట్లాడుతూ అక్రమంగా అధికలోడుతో ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్‌చేసి వాహన యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల సంగం మండలం పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారికి రూ. 25లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, రోడ్డు ప్రమాదానికి కారకులైన వారిపై తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు బెల్లంకొండ హజరత్తయ్య, నాగేంద్ర, మాలకొండయ్య, ఎం రమణయ్య, పలువురు సీపీఎం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి : సీడీపీవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో పి సునీలత

ఆత్మకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ చూపాలని ఆత్మకూరు సీడీపీవో పి సునీలత సూచించారు. మండలంలోని మహిమలూరులో శుక్రవారం రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం ప్రధాన అంశంగా స్థూలకాయం నివారణ, తదితర అంశాలపై అవగాహన కల్పించడమే పోషణ మాసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామ పంచాయతీలు, సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు శ్రీదేవి, కస్తూరి, తల్లులు పాల్గొన్నారు.

●దుత్తలూరు (ఉదయగిరి): మండలంలోని భైరవరం గ్రామ సచివాలయంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు అయూబ్‌అప్సర్ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లెక్కల వెంగళరెడ్డి, మేకపాటి మాల్యాద్రి నాయుడు, అంది రామయ్య, చుండి హరి గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నందిపాడులో అవగాహన సదస్సు

మండలంలోని నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దేవకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో కిమ్స్ సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల న్యూరో ఫిజిషియన్ అభినయరెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఇటీవల జిల్లా ఉత్తమ అవార్డు పొందిన ఉపాధ్యాయిని ఫాతిమాజాన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉదయగిరిలో...

ఉదయగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి ఎం.ప్రశాంతబాబు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సొసైటీల అభివృద్ధికి కృషి చేయాలి : మాజీ ఎమ్మెల్యే కంభం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి

దుత్తలూరు (ఉదయగిరి), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోకవర్గంలో నూతనంగా ఎంపికైన చైర్మన్లు, డైరెక్టర్లు సొసైటీల అభివృద్ధికి కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక కమ్మవారిపాళెం సొసైటీ చైర్మన్‌గా పేలపూడి వెంకటరత్నం, డైరెక్టర్లుగా చుండి హరిగోపాల్ రెడ్డి, దుంపల గడ్డ సరితలు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నార న్నారు. రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎంపికైన పాలకవర్గం తమను ఎంపిక చేసిన ఎమ్మెల్యే కాకర్ల, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్, డైరెక్టర్లను సన్మానించి అభినందనదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డివిజన్ అధికారి శ్రీనివాసరెడ్డి, సీఈవో లోక్‌నాథ్‌రెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంటల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు బాలుడు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలుడును పోలీసులు గంటల వ్యవధిలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల మేరకు.. నెల్లూరు నగరంలోని శాంతినగర్ వద్ద శుక్రవారం 12 ఏళ్ల బాలుడు ఏడుస్తూ సైకిల్ తొక్కుకుంటూ వెళుతుండటంతో స్థానికులు పట్టుకుని దర్గామిట్ట పోలీసులకు అప్పగించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్లకు విషయం తెలియడంతో ఆమె ఆదేశాల మేరకు బాలుడి తల్లిదండ్రులను గుర్తించేందుకు నగరంలోని అన్ని పోలీసు స్టేషన్‌ల సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆ బాలుడి తల్లిదండ్రులు కోటమిట్టలో ఉండగా పోలీసు స్టేషన్‌కు రప్పించారు. పడుగుపాడుకు చెందిన ఆ కుటుంబ సభ్యులు కోటమిట్టలోని తన అమ్మవారి ఇంటికి వచ్చారు. శుక్రవారం నమాజ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోగా ఇంట్లోని బాలుడు కనిపించలేదు. చుట్టపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. అదే సమయంలో దర్గామిట్ట పోలీసులు వారిని గుర్తించి బాలుడును అప్పగించారు. బాలుడును తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు



ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

సంగం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దువ్వూరు సమీపంలో ముంబయి జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం ఆటో బోల్తాపడడంతో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నై పట్టణానికి చెందిన ఓ ముస్లిం కుటుంబం సంగం మండలంలోని తరుణవాయిలో ఉన్న మస్తాన్‌బాబా దర్గా దర్శనానికి నెల్లూరులో బాడుగ ఆటో తీసుకుని బయలు దేరారు. మార్గమధ్యంలో దువ్వూరు సమీపంలో వెనుక వస్తున్న ఆటో ఢీకొన డంతో దర్గాకు వెళ్తున్న ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురికి గాయాలుకాగా సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు, ల్యాప్‌టాప్ చోరీ : కేసు నమోదు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కారు అద్దాలు పగులగొట్టి కారులోని నగదు, ల్యాప్‌టాప్ తదితర వస్తువులను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఏఎస్‌పేట మండలానికి చెందిన కీర్తి తన పిల్లల ఆరోగ్యం బాగలేకపోవడంతో గురువారం తన కారులో పొగతోటలోని ఓ వైద్యశాలకు తీసుకువచ్చారు. వైద్యశాలలో పిల్లలను చూపించుకొని మద్రాసు బస్టాండు వద్ద ఉన్న బాటాషోరూమ్‌కు వచ్చారు. కారును షోరూమ్ ఎదుట పార్క్ చేసి లోపలికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు కారు కుడివైపు వెనుక డోర్ అద్దాలు పగులగొట్టి లోపల ఉన్న రెండు ల్యాప్‌టాప్‌లు, పాస్‌పోర్టు, హ్యాండ్‌బ్యాగ్, ఫోన్, కాలి వెండిపట్టీలు, రూ.15 వేల దోచుకెళ్లారు. షోరూమ్ బయటకు వచ్చిన ఆమె కారు అద్దాలు పగులగొట్టి ఉండటం, లోపల వస్తువులు కన్పించకపోవడంతో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసుల ప్రత్యేక దృష్టి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 9 మందిపై కేసులు నమోదు చేశారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన 87 మందికి రూ. 33,135 జరిమానా విధించి, రెండు వాహనాలు సీజ్ చేశారు. రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. బహిరంగ మద్య సేవనం చేస్తున్న పది మందిపై కేసులు నమోదు చేశారు. జిల్లాలోని 31 లాడ్జీలను తనిఖీలు చేశారు. లాడ్జీల్లో గదిని అద్దెకు తీసుకునేవారి వివరాలను ప్రతిరోజు పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు పాల్గొన్నారు.

రైలు కిందపడి స్నేహితుల ఆత్మహత్యాయత్నం

● ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఒకేచోట పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఇద్దరు స్నేహితులు రైలు కిందపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిత్తూరు జిల్లా పూతలపట్టుకు చెందిన జీ ఉమేష్ చంద్ర (24), పొదలకూరు మండలం తోడేరు పంచాయితీకి చెందిన పీ.వంశీలు నెల్లూరు నగరంలోని హరనాథపురంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఈనెల 17వ తేదీ రాత్రి స్నేహితులిద్దరు బర్త్‌డే పార్టీ అంటూ యజమాని వద్ద రూ.2 వేలు తీసుకుని బయటకు వచ్చారు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ గురువారం వెంకటేశ్వరపురం ఫ్లైవోవర్ బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. సంఘటనా స్థలంలోనే ఉమేష్‌చంద్ర మృతి చెందగా, అపస్మారక స్థితిలో ఉన్న వంశీని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. వంశీ కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారు నెల్లూరుకు చేరుకొని మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ వైద్యశాలకు తరలించారు. ఉమేష్‌చంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిచందన తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు

అనంతసాగరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాగరంలో కుక్కల బెడద ఎక్కువైంది. పీర్‌సాహెబ్‌పేట వద్ద ఒక బాలుడిపై కుక్క దాడి చేయగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల నిర్మూలన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తల్లి బాగోగులు పట్టించుకోని కొడుకు, కోడలిపై కేసు నమోదు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలైన తల్లి బాగోగులు పట్టించుకోకుండా నిరంతరం ఆమెను దుర్భాషలాడుతున్న కొడుకు, కోడలిపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం శ్రామికనగర్‌లో జయకుమారి తన కొడుకు సాత్విక్, కోడలితో కలిసి నివాసం ఉంటోంది. ఆమె భర్త గతేడాది అనారోగ్యంతో మృతి చెందాడు. కోడలు కొంతకాలంగా ఆమెకు అన్నం పెట్టకుండా దుర్భాషలాడుతుంటంతో కుమారుడు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో ఈనెల 14వ తేదీన ఆమె తన ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని కొడుకు, కోడలుకు చెప్పింది. దీంతో కోపోద్రిక్తులైన వారు ఆమెను నానా దుర్భాషలాడారు. ఈ మేరకు బాధితురాలు జయకుమారి శుక్రవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

SCHEDULE

[illegible]

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	138
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	272

కోడిగుడ్ల ధర (100): 560

స్వచ్ఛతా సేవా కార్యక్రమంపై అవగాహన

కావలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా సేవా కార్యక్రమంపై శుక్రవారం కావలి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ అధికారులు, సిబ్బందికి మున్సిపల్ కమిసనర్ జీ. శ్రావణ్‌కుమార్ అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్మికులకు పీపీ కిట్లు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులు ఎన్‌జీవోలతో కలిసి కావలి పట్టణం వెంగళరావునగర్‌లోని అమృత్‌పార్కును శుభ్రం చేయించారు. అనంతరం నలందస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు స్వచ్ఛతపై మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించి వారిచేత ప్రతిజ్ఞ చేయించారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

న్యూస్ బాక్స్

అల్లూరులో దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

అల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖ ప్రవేశపెట్టిన ఓటీపీ ప్రక్రియను రద్దుచేయాలంటూ దస్తావేజు లేఖరులు చేపట్టిన రాష్ట్రవ్యాప్త పెన్‌డౌన్ కార్యక్రమాన్ని అల్లూరులో శుక్రవారం స్థానిక దస్తావేజు లేఖరులు చేపట్టారు. ఈ సందర్భంగా సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరగలేదు. దీంతో వచ్చిన కక్షిదారులు వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, గోపీనాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి



వాల్మీకి

కావలి (టౌన్) సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమని ప్రముఖ మోటివేటర్ వ్యాస చంద్రశేఖర్ వాల్మీకి పేర్కొన్నారు. శుక్రవారం మద్దూరుపాడులోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, నైపుణ్యాభివృద్ధిపై మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమస్యలను అధిగమించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు, ప్రిన్సిపాల్ టీవీ రావు, డిప్లమా ప్రిన్సిపాల్ రమణయ్య, ఏవో రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

కావలి (టౌన్) సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు భావితరాలకు మేలు చేస్తాయని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు.

17వ వార్డులో డ్రై డే!

కందుకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 17వ వార్డులో మున్సిపల్ కమీషనర్ కె అనూష ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యసిబ్బంది డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు శుభ్రం చేయటంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గృహాల పరిసరాల్లో కూలర్లు, నీటితొట్టెలు, పాత టైర్లు, కుండీలలో తాగిపడేసిన కొబ్బరిబోండాలలో వర్షపునీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాటిలో పెరిగే దోమలతో డెంగ్యూ, మలేరియా లాంటి విష జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



అంటువ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

కమ్ముకున్న కారుమబ్బులు

బిట్రగుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి కారుమబ్బులు కమ్ముకున్నాయి, అల్పపీడనం వలన కురిసిన వర్షాలకు వరి పైరులో నీరుచేరి ఇప్పుడిపుడే కోలుకుంటున్న రైతన్నకు కారుమబ్బులు చూసి గుండెల్లో గుబులు రేగింది. కాగా, చిరుజల్లులకు పరిమితమైన వరుణుడు శాంతించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.





దస్తావేజు లేఖర్ల నిరసన

కావలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ విధానంలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాల వలన రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు, చేసేవారు, డాక్యుమెంట్ రైటర్లు ఇబ్బందులు పడుతున్నారని, దానిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కావలిలో శుక్రవారం డాక్యుమెంట్ రైటర్స్, స్టాంప్ వెండర్స్ పెన్‌డౌన్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్‌లో ఉన్న లోపాలను సరిచేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పాత విధానంలో రిజిస్ట్రేషన్‌లు కొనసాగించాలని కోరారు. ఈ స్టాంప్ విధానాన్ని తొలగించి నాన్‌జ్యుడిషియల్ స్టాంప్‌లను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చలంచర్ల నాగరాజు, పీడీఎం ప్రసాద్, స్టాంప్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషయ్య, షేక్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రంలో దంచికొట్టిన వాన

లింగసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం సాయంత్రం లింగసముద్రంతో పాటు పలు గ్రామాలలో వర్షం దంచి కొట్టింది. సుమారు అరగంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. లింగసముద్రంలోని ఆర్ అండ్‌బీ రోడ్డుపై వర్షపు నీరు భారీగా ప్రవహించింది. మండలంలో ఇటీవల సాగు చేస్తున్న పొగనార్లు, జొన్నమేత, పత్తి పైర్లకు వర్షం మేలు చేకూరుస్తుందని రైతులు చెబుతున్నారు.





మా సమస్యలు పరిష్కరించండి

- మున్సిపల్ కార్మికుల ధర్నా

కావలి (టౌన్) సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పట్టణ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని, ఎన్నికల హామీలు విస్మరించిందన్నారు. జులై నెల సమ్మె కాలం జీతం ఇవ్వాల్సి వుందని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.7లక్షలు, మట్టి ఖర్చులు రూ.20,000, వయసు, పేరుతో తొలగించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి పని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ప్రవీణ్, యూనియన్ అధ్యక్షుడు బాబు, కార్యదర్శి క్రాంతికుమార్, తురకా శీనయ్య, రమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీజు పనులు త్వరగా పూర్తి చేయండి

- రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించిన ఈఈ మునిరత్నం

లింగసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో పాత, కొత్త స్పిల్‌వేలలో గేట్లకు గ్రీజు పెట్టే పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రాజెక్టు ఈఈ జి మునిరత్నం సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన డీఈఈలు ఎం వెంకటేశ్వర్లు, పి శేషయ్యలతో కలిసి ప్రాజెక్టును తనిఖీ చేశారు. అలాగే రెండు స్పిల్‌వేలలోని గేర్ బాక్స్‌లు, గేట్ల రోప్‌లకు గ్రీజు, క్యాడ్మియమ్ కాంపౌండ్ పెట్టే పనులను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్టు నిండి గేట్లు ఎత్తాల్సిన పరిస్థితి వస్తే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గేట్లు ఎత్తడంలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు, సిబ్బంది గ్రీజు పెట్టే పనులు పూర్తి చేయాలన్నారు.







కొండాపురంలో కేకును తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు, మక్కెనవారిపాలెంలో పూజలు



కలిగిరిలో కేకు కట్ చేస్తున్న బిజ్జం కృష్ణారెడ్డి

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల జన్మదిన వేడుకలు

కావలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను శుక్రవారం సాయంత్రం ఆయన అభిమానులు కావలిలో ఘనంగా నిర్వహించారు. రైతుసంఘం నాయకుడు రామిరెడ్డి క్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో కావలి కలుగోళ్ల శాంభవి అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే కాకర్ల పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడకు వచ్చిన వారికి మిఠాయిలు పంపిణీ చేశారు.

● **కొండాపురం :** ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం మండలంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో బస్టాండు సెంటర్లో 20 కేజీల భారీ కేకును కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈకార్యక్రమంలో మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు గంటా లక్ష్మీనరసింహులు, యారవ క్రిష్ణయ్య, బొట్లగుంట హరిబాబు, పోలినేని రమేష్, తెలుగు యువత అధ్యక్షుడు దాసరి అశోక్, జాగర్లమూడి శ్రీనివాసులు, దామా శివబాబు, మండల మహిళా అధ్యక్షురాలు చిమ్మిలి శ్రీదేవి, పలుగ్రామాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మక్కెనవారిపాలెంలో..

మండలంలోని సాయిపేట పంచాయతీ



జలదంకి : వేడుకల్లో కాకర్ల

మక్కెనవారిపాలెంలో మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, టెలికాం బోర్డు అడ్వైజరీ మెంబరు తాటికొండ అనూషల ఆధ్వర్యంలో స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కాకర్ల సురేష్ పుట్టినరోజును పురస్కరించుకొని ప్రత్యేక పూజలుచేశారు. వికలాంగులకు పండ్లు పంపిణీచేసి మొక్కలు నాటారు. వెల్లటూరివారిపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు స్వీట్లు, చాక్లెట్లు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జలదంకి, జమ్మలపాలెంలో...

జలదంకి : ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి జలదంకి, జమ్మలపాలెం గ్రామాల్లో జరిగాయి. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే రాత్రి జలదంకి మండలానికి చేరుకొని పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన బర్త్‌డే కేకును కట్ చేసి అభిమానుల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి కేకులు తినిపించారు. ఈ వేడుకల్లో మండల పార్టీ అధ్యక్షుడు మధురెడ్డి, నాయకులు జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అప్పలనాయుడు, పెంచలనాయుడు వినోద్, మందపల్లి మాల్యాద్రి, ఎం సుబ్బారెడ్డి, మధునాయుడు, హరిబాబు, తిరుమలరెడ్డి, రఘు పాల్గొన్నారు.

● **కలిగిరి :** ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదినాన్ని శుక్రవారం టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసిం నరసింహులు నాయుడు, గన్నమనేని శ్రీనివాసులు, చేరెడ్డి సుబ్బారెడ్డి, మాదాల శ్రీనివాసులు, స్వర్ణ కొండయ్య, పార్టీ సీనియర్ నాయకులు, బూత్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు మట్టి ఆరోగ్య కార్డులు కలిగి ఉండాలి



ఉలవపాడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు మట్టి ఆరోగ్య కార్డు కలిగి ఉండాలని, అందులోని వ్యవసాయ పద్ధతులను పాటించాలని కందుకూరు భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయాధికారిణి గీతాప్రకాష్ సూచించారు. మండలంలోని వీరేపల్లి మోడల్ పాఠశాలలో నేల ఆరోగ్యంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ భూమిలోని పోషకాల స్థితిని బట్టి ఎరువులు, సూక్ష్మ పోషకాలను వాడటం వల్ల పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చన్నారు. కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటేష్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికను ఉపయోగించి నేల పరీక్షలు ఎలా చేయాలి? ఎలాంటి పద్ధతులను అనుసరించాలనే విషయాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మంజుల, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్

లింగసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం లింగసముద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో సీఐటీయూ మండల మహాసభ కన్వీనర్ బి మార్తమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్కీం వర్కర్లయిన అంగన్‌వాడీ, ఆశా, మిడ్ డే మీల్స్ తదితర కార్మికులకు జీతాలు పెంచకుండా, వెట్టి చాకిరీ చేయిస్తున్నారన్నారు. కార్మిక హక్కులను కాలరాసి నాలుగు లేబర్ కోడ్లు విధించి, కార్మికులను వీధుల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, రాయితీలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్‌గా బి మార్తమ్మ, కో కన్వీనర్‌గా షేక్ ఆలీషా, మరో 19 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె వెంకయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు ఫరీమా, ప్రమీల, సుగుణ, ప్రభావతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

దగదర్తి (బిట్రగుంట) సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఎంఈవో భాస్కర్ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంఈవోలు ఎం.భాస్కర్, జి.విజయత్నం మాట్లాడుతూ 19, 20 తేదీల్లో మండల స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. కోకో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాట్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు అండర్-14, అండర్-17 విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ ఎన్.శ్రీనివాసులు, పీడీ, పీఈటీలు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభంలో త్రోబాల్ వేస్తున్న హెచ్‌ఎం మారుతి



నిరసన తెలుపుతున్న మజ్దూర్ యూనియన్ సభ్యులు

రైల్వే కార్మికులకు పే కమిషన్ కమిటీ వేయాలి

బిట్రగుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికులకు పేకమిషన్ కమిటీని ఏర్పాటు చేయాలని సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచ్ ఛైర్మన్ మద్దిబోయిన శేఖర్ డిమాండ్ చేశారు. ఏఐఆర్‌ఎఫ్ మరియు ఎస్‌సీఆర్‌ఎంయు ఆదేశాల మేరకు బిట్రగుంట పీడబ్ల్యూపీవే కార్యాలయం ఎదుట రైల్వే కార్మికులతో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కమిటీ సభ్యులు వీఎస్.బాబు, ఆర్వీ.నరసయ్య, పీఆర్.బాబు, రైల్వే రిటైర్డ్ అసోసియేషన్ ఛైర్మన్ ఎస్.శ్రీనివాసులు, కార్యదర్శి టీ.రామయ్య, రైల్వే కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను తరచూ తనిఖీ చేయాలి

- జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

కావలి రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎంఈవోలు తరచూ పాఠశాలలను తనిఖీలు చేస్తూ ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సూచించారు. కావలి పట్టణ ముసునూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటూ తమ దృష్టికి తీసుకురావాలని ఎంఈవోలు గోవిందయ్య, వెంకట సుబ్బయ్యలకు సూచించారు. పాఠశాలలో నూతన మరుగుదొడ్ల నిర్మాణాని కి, మరమ్మతులకు రూ.3.30 లక్షలు నిధులు మంజూరు చెయ్యటం జరిగిందన్నారు. అనంతరం విద్యా ర్థుల హాజరు తనిఖీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులు, ఎంపీడీవో శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్నాధ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మరుగుదొడ్లు పరిశీలిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణమ్మ

దేశాభివృద్ధిలో స్త్రీశక్తి కీలకం : డిప్యూటీ డీఎంహెచ్‌వో

కావలి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో స్త్రీశక్తి కీలకం అని, మహిళల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నాయని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత తెలిపారు. కావలి పట్టణం రాజీవ్‌నగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సహకారంతో శుక్రవారం ఆ హెల్త్ సెంటర్‌లో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. డాక్టర్ బ్రిజిత మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలోని మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా దేశంలోని ప్రజలందరికీ మెరుగైన సేవలు అందించేందుకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం డాక్టర్ రామ్‌సెంటర్ వారు ఐరన్, పోలిక్, కాల్షియం సిరప్‌లు పిల్లలకు మల్టీవిటమిన్ సిరప్‌లు పం పిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్‌హెల్త్ సెంటర్ డాక్టర్ మేఘనాధచౌదరి, గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ, ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య, డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ముడిగండ్ల మాలకొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణీ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత

ఉలవపాడులో...

ఉలవపాడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు సచివాలయం1 పరిధిలోని జనరల్ ప్రాథమిక పాఠశాలలో 'స్వస్త్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అనిల్‌కుమార్, సిబ్బంది రోగులకు వైద్యసేవలు అందించారు. స్త్రీలకు సంబంధించిన క్యాన్సర్, మాతాశిశు సంరక్షణ వ్యాక్సిన్‌లపై అవగాహన కల్పించారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధుల నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వైద్యశిబిరంలో 153 మందికి బీపీ, షుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది పోషక పదార్థాలతో కూడిన వంటకాలు చేసి స్టాల్ నిర్వహించారు. తల్లులు, పిల్లలకు పాలు, గుడ్లు తదితర పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు నాగలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ అధికారులు, గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



ఉలవపాడులో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

సీఎల్‌పురంలో...

బిట్రగుంట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని నాగులవరం పీఏసీఎస్ ఆవరణంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా కోవూరుపల్లి వైద్యులు రామకృష్ణ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల టీడీపీ కన్వీనర్ ఎం.నాగేశ్వరరావు, సింగల్ విండో అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. నోటి, గర్భాశయ క్యాన్సర్లకు, గుండె సంబంధిత వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమం లో పీఏసీఎస్ డైరెక్టర్లు ఎల్.మాధవరావు, వీ.సుధాకర్, సీహెచ్‌వో నజీమున్నీసా, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ్ మహా'

కందుకూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో సీడీపీఓ ఉషారాణి ఆదేశాలతో శుక్రవారం 'పోషణ్ మహా' కార్యక్రమాన్ని నిర్వహించారు. మోపాడు 2 అంగన్‌వాడీ సెంటర్‌లో సూపర్‌వైజరు యు ప్రభావతి ఆధ్వర్యంలో, శ్రీనగర్‌కాలనీ 2 అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజరు ఎస్‌కే షకీలాబేగం ఆధ్వర్యంలో, ఖాజీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజరు ఎల్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో 'పోషణ్ మహా' కార్యక్రమం నిర్వహించి పౌష్టికాహార ఆవశ్యకతను వివరించారు. మోపాడులో అంగన్‌వాడీ కేంద్రాలకు తమసంస్థ సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరల్డ్‌విజన్ సంస్థ మేనేజరు యాషియ్య కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుభాషిణి, లలితలక్ష్మి, శ్రీలక్ష్మి, కేశవకుమారి, శ్రీదేవి, శ్రీలక్ష్మి, రమాదేవి, కోటిరత్నం, యాస్మిన్, విజయకుమారి, నూర్జహాన్, రహంతున్నీషా, నసీమ్, మైమూన్, కె ఇందిర తదితరులు పాల్గొన్నారు.



పోషకాహార ప్రమాణం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



గూడూరు మండలం తుంగపాళెం గ్రామం వద్ద కలర్‌షైన్ పరిశ్రమలో ప్రమాదం జరిగిన ప్రదేశం ఇదే (ఫైల్)

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కనబడటం లేదు. ఎక్కడో ఒకచోట.. ఏదో ఒక ప్రమాదం జరుగుతూ కార్మికుల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. పరిశ్రమ మనుగడకూ ఇబ్బందిగా తయారవుతున్నాయి. భద్రతా ప్రమాణాల డొల్లతనాన్ని బహిర్గతపరుస్తున్నాయి.

\- తడ, ఆంధ్రజ్యోతి

పరిశ్రమల్లో భద్రత డొల్ల

- తరచూ ప్రమాదాలు
- ఉదాసీనంగా పరిశ్రమ వర్గాలు
- పట్టించుకోని అధికారులు

రాష్ట్రాభివృద్ధికి పారిశ్రామికీకరణ ఎంతో ముఖ్యం. ఆ ప్రకారం జిల్లాలో స్థాపితమైన శ్రీసిటీ, మాంబట్టు, మేనకూరు సెజ్‌లలో వందల పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఆయా పరిశ్రమల ద్వారా లక్ష మందికి పైగా ఉద్యోగావకాశాలు లభించాయి. అంతవరకు బాగానే ఉన్నా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించడంలో మాత్రం యాజమాన్యాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. కొన్ని పరిశ్రమల్లో అయితే ఆ భద్రతా ప్రమాణాలు మచ్చుకైన కనపడని పరిస్థితి. తద్వారా ఏదో ఒక రూపంలో ఎక్కడో ఒకచోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దాంతో ఆయా ప్రమాదాల బారీనపడి ప్రాణాలు కోల్పోయే కార్మికులే కాకుండా పరిశ్రమ మనుగడకు ఇది ఇబ్బందిగా మారుతుంది.

ఇటీవల జరిగిన ప్రమాదాలివీ

- ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన పెళ్లకూరు మండలం పెన్నేపల్లి సమీపంలోని అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో ఫర్నేస్ ఆయిల్ బాయిలర్ తీవ్రమైన ఒత్తిడికి లోనై పేలిపోవడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు సిపాయిలాల్, సోనూమహ్మద్ మృతిచెందారు. మరో 8 మంది వరకు గాయపడ్డారు.
- జూన్ 26వతేది ఇదేపరిశ్రమలో మరోసారిఅగ్ని ప్రమాదం జరిగి జూరాల యాదవ్ అనే కార్మికుడు మృతి చెందాడు.
- గూడూరు మండలం తుంగపాళెం గ్రామం వద్ద ఉన్న కలర్‌షైన్ పరిశ్రమలో ఈనెల 13వ తేదీ జింక్‌ట్యాంక్ బాయిలర్ పేలిపోయిన దుర్ఘటనలో ఆదిత్యకుమార్ అనే కార్మికుడిపై జింక్ ద్రావణం పడింది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందగా, మరో 10 మంది వరకు గాయపడ్డారు.
- 2023లో ఓజిలి మండలం పెద్దపరియ గ్రామ సమీపంలోని నెల్‌క్యాస్ట్ పరిశ్రమలో ఫర్నేస్ ఆయిల్ బాయిలర్ పేలి సిలిండర్లపై పడ్డాయి. అవి పేలిపోయి ఆ పక్కనే విధుల్లో ఉన్న ఇద్దరు కార్మికులు అక్కడిక్కడే మృతి చెందగా, మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు.
- ఏడాది క్రితం మాంబట్టు సెజ్‌లోని డాల్మీయా పరిశ్రమకు సమీపంలోని అనధికార పరిశ్రమల వ్యర్థాల డంప్‌లో అగ్నిప్రమాదం జరగడంతో అగ్నిమాపక సిబ్బంది సుమారు 10 ఫైర్ ఇంజన్లతో రెండు రోజులపాటు తీవ్రంగా శ్రమించి ఆ మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో డాల్మీయ పరిశ్రమకు కొంత నష్టం వాటిల్లింది.
- తాజాగా గురువారం.. ఏర్పేడు మండలం వికృతమాల రెవెన్యూ పరిధిలోని మునోత్ లిథియం అయాన్ బ్యాటరీల తయారీ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆ సమయంలో పరిశ్రమలో కార్మికులెవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. రూ.65 కోట్లకుపైగా ఆస్తినష్టం జరిగినట్లు భావిస్తున్నారు.
- ఇక, మేనకూరు సెజ్‌లోని అరబిందో పరిశ్రమలోని గ్రాన్యూలేషన్ విభాగంలోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సుమారు రూ.15 కోట్ల ఆస్తినష్టం జరిగింది. అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు.



ఏర్పేడు మండలం వికృతమాలలోని మునోత్ పరిశ్రమలో గురువారం నాటి ప్రమాదంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఉదాసీనంగా పరిశ్రమ వర్గాలు

పరిశ్రమలో భద్రతా ప్రమాణాలపై కార్మిక, రెవెన్యూ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి. జాతీయ భద్రతా సూచనలకు అనుగుణంగా ఆ పరిశ్రమ ఉందా లేదా అన్నది నిర్ధారించాలి. అలాగే బాయిలర్లు తీవ్ర ఒత్తిడితో ఉండే ట్యాంక్‌ల నాణ్యతా ప్రమాణాలను ప్రతి 6 నెలలకోసారి ఆయా సంస్థలు తనిఖీచేసి వాటి ఫిట్‌నెస్‌ను నిర్ధారించాలి. అలాగే ఐఎస్ఐ, ఐఎస్‌వో వంటి జాతీయ, అంతర్జాతీయ సంస్థలు కూడా పరిశ్రమ భద్రతా ప్రమాణాలను పరిగణలోకి తీసుకుని ఆమేరకు సర్టిఫికెట్లను మంజూరు చేయాలి. ఇలా భద్రతపై అటు ప్రభుత్వాలు, ఇటు ప్రభుత్వేతర సంస్థలు ధ్రువీకరించాకే ఆ పరిశ్రమ నడవాల్సి ఉంటుంది. కానీ, ఇన్ని నియమాలను, తనిఖీలను పరిశ్రమలు పెద్దగా పట్టించుకోవవడం లేదన్న విమర్శలున్నాయి. వీటిని ధ్రువీకరించి సర్టిఫికెట్లు మంజూరు చేసే సంస్థలు కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఇలా మొక్కుబడిగా తనిఖీలతో సర్టిఫికెట్లను మంజూరు చేయటంతోనే ఇటువంటి ప్రమాదాలకు మూలంగా కనబడుతోందన్న ప్రచారం జరుగుతోంది. భద్రతలోపాలు బయటపడకూడదనే ఉద్దేశ్యంతో కొన్ని పరిశ్రమలు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లో అగ్ని ప్రమాదమని చెప్పడం సాధారణమైందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే ఒక విద్యుత్ ప్యానల్ బోర్డులోని వైర్లలో చిన్నపాటి లోపం ఏర్పడిన వెంటనే వాటిని నియంత్రించేలా ఏర్పాటు చేసే రిలే యూనిట్ల ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగదు. ఒకవేళ అలా ప్రమాదం జరిగితే ఆ రిలేలు చెడిపోయేస్థితిలో ఉండటమో, నాణ్యతా ప్రమాణాలు లేని రిలేలను వినియోగించడంతోనే ఇటువంటి షార్ట్‌సర్క్యూట్‌లు జరుగుతుంటాయి. మచ్చుకు ఇది ఒక ఉదాహరణమాత్రమే. ఇలా ఇటువంటి ప్రమాదాల నేపథ్యంలో అధికారులు పరిశ్రమల్లో నిరంతరంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రమాదం జరిగిన రెండు, మూడు రోజులపాటు హడావుడి చేసి ఆ తర్వాత పట్టించుకోకపోవడంతోనూ ఇలాంటి ప్రమాదాలు మళ్లీ మళ్లీ జరుగుతున్నాయని చెప్పవచ్చు.

నేడు కలెక్టర్‌కు స్కోచ్ పురస్కారం



తిరుపతి(కలెక్టరేట్),సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్ ఢిల్లీలో శనివారం స్కోచ్ పురస్కారం అందుకోనున్నారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి న్యూఢిల్లీకి చెందిన స్కోచ్ సంస్థ ఏటా పురస్కారాలు అందజేస్తోంది. చంద్రగిరి నియోజకవర్గం స్వర్ణనారావారిపల్లె కింద సి.రామాపురం, కందులవారిపల్లె, రంగంపేట పంచాయతీల్లో 45 రోజుల్లో 1,600 గృహాలకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసినందుకు గాను కలెక్టర్ ఈ పురస్కారం అందుకోనున్నారు.

క్రిప్టో కరెన్సీ పేరుతో మోసం

- రూ.13.5 లక్షల స్వాహా

తిరుచానూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీతో భారీ ఆదాయం వస్తుందని నమ్మించి రూ.13.5లక్షలు కాజేసిన ఘటన తిరుచానూరులో శుక్రవారం చోటుచేసుకుంది. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. తిరుచానూరు వసుంధరనగర్‌కు చెందిన హిమసాగర్ చిన్న ప్రైవేటు కంపెనీ నిర్వహిస్తున్నారు. అతడి తండ్రి టీటీడీ ఉద్యోగి. చైతన్యపురం గజలక్ష్మి గ్రీన్‌సిటీ వద్ద నివాసం ఉంటున్న ఉత్కర్ష్ రామాయణం హిమసాగర్‌కు స్నేహితుడు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే షేర్స్ తరహాలో భారీ ఆదాయం వస్తుందని హిమసాగర్‌ను నమ్మించాడు. ఉత్కర్ష్ రామయణం ఓ ఖాతా నెంబరు చెప్పి అందులో డబ్బు జమ చేయాలని సూచించాడు. హిమసాగర్ రూ.13.50 లక్షలు సదరు ఖాతాకు జమ చేశారు. నెల రోజులైనా డబ్బు తిరిగి రాకపోవడంతో హిమసాగర్ ఉత్కర్ష్ రామాయణాన్ని నిలదీశారు. తనకు సంబంధం లేదని చెప్పడంతో బాధితుడు శుక్రవారం రాత్రి తిరుచానూరు పోలీసులను ఆశ్రయించారు. ఉత్కర్ష్ రామాయణంపై చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. క్రిప్టో కరెన్సీ, షేర్ మార్కెట్స్, బిట్‌కాయిన్స్‌తో అధిక లాభాలు వస్తాయని చెప్పే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.



టీడీపీలోకి ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి



ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబునాయుడు

తడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి టీడీపీలో చేరారు. అమరావతిలో శుక్రవారం ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడును కలవగా, ఆయన పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కాగా, కళ్యాణ్‌చక్రవర్తి తండ్రి బల్లి దుర్గాప్రసాద్ 2019 ఎన్నికలకు ముందు వరకు టీడీపీలో ఉన్నారు. టీడీపీ నుంచి గూడూరు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు. 2019 ఎన్నికల సమయంలో టీడీపీని వీడి వైసీపీలో చేరి తిరుపతి ఎంపీగా గెలుపొందారు. 2020లో ఆయన మృతి చెందడంతో ఆయన కుమారుడైన బల్లి కళ్యాణ్ చక్రవర్తికి వైసీపీ ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి తరువాత ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి తన పదవికి రాజీనామా చేస్తూ శాసనమండలి ఛైర్మన్‌కు సమర్పించారు. ఆ రాజీనామా ఇప్పటికీ పెండింగ్‌లో ఉంది. అప్పటి నుంచి ఆయన టీడీపీతో సఖ్యతగా ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, సూళ్లూరుపేట, గూడూరు, చంద్రగిరి ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, పాశిం సునీల్‌కుమార్, పులివర్తి నాని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.



చేపలమార్కెట్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

పిడుగుపడి రైతు కూలీ మృతి

నాయుడుపేట టౌన్ ఆంధ్రజ్యోతి: నాయుడుపేట మండలం కలిపేడు పంచాయతీ గంగమ్మకట్ట కాలనీకి చెందిన శివయ్య(22) పిడుగుపడి మృతి చెందారు. శుక్రవారం సాయంత్రం వ్యవసాయ పనులు చేస్తుండగా పిడుగుపడటంతో అక్కడిక్కడే చనిపోయారు.

తిరుపతిలో కుండపోత

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ద్రోణి ప్రభావంతో తిరుపతిలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వాన పడింది. వీధులన్నీ నదులను తలపించాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు.



నగరంలో పడుతున్న వర్షం

బతుకు బండి బలి తీసుకుంది

- ట్రాక్టర్ తిరగబడి రైతు కూలీ మృతి





బోల్తా పడ్డ ట్రాక్టర్ కింద ఇరుకుపోయిన బత్తెయ్యి, మృతి చెందిన బత్తెయ్య

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి రైతు కూలీ, డ్రైవర్ బత్తెయ్య(48) మృతి చెందారు. తొట్టంబేడు మండలం పూడి కొత్త దళితవాడకు చెంది బత్తెయ్య వ్యవసాయ కూలీ. అదే గ్రామంలోని ఓ రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పొలం పనులు చేస్తూ జీవనం సాగించేవారు. శుక్రవారం సాయంత్రం వరి నాటేందుకు ట్రాక్టర్‌తో బత్తెయ్య అడుసు దున్నే పనులు చేపట్టారు. బురదలో ట్రాక్టర్ చక్రం చిక్కుకుపోవడంతో బయటకు తీసే క్రమంలో ఒక్కసారిగా ఇంజిన్ తిరగబడింది. ట్రాక్టర్ కింద బత్తెయ్య చిక్కుకుపోవడంతో బురదలో కూరుకుపోయి అక్కడికక్కడే మృతి చెందారు. తొట్టంబేడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తిరుచానూరుపై చిన్నచూపేల?

వసతుల కల్పనలో టీటీడీ శీతకన్ను



మూతబడిన మరుగుదొడ్లు - క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన స్థలం

(తిరుచానూరు, ఆంధ్రజ్యోతి)

శ్రీవేంకటేశ్వరుడికి ఇష్టసఖి పద్మావతీ దేవి. భక్తులు కూడా అమ్మవారికి అంతే ప్రాధాన్యమిస్తారు. కానీ, టీటీడీ మాత్రం తిరుమలపై పెట్టిన శ్రద్ధ తిరుచానూరు మీద పెట్టడం లేదు. తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకోవడానికి రోజూ సగటున 30వేలమందికి పైగా భక్తులు వస్తున్నారు. పదేళ్ల క్రితంతో పోలిస్తే ఈ సంఖ్య రెండింతలు పెరిగింది. అయితే ఇందుకు దీటుగా ఆలయం వద్ద వసతులు మాత్రం పెరగలేదు. తమిళనాడు నుంచి వచ్చే భక్తులు తిరుచానూరులో బసచేసి అలిమేలు మంగమ్మను దర్శించుకున్న తర్వాతే తిరుమల వెళ్తుంటారు. అయినా ఇక్కడ కల్యాణ మండపాలు తప్ప ప్రయివేటు లాడ్జీలు కూడా పెద్దగా లేవు. భక్తులు మాడవీధుల్లోనే నిద్రిస్తున్నారు. మరికొందరు తోళప్ప గార్డెన్‌లోని కల్యాణ మండపాల ముందు రోడ్లపై సేదతీరుతున్నారు. మాడవీధుల్లో రాత్రి సమయాల్లో ఆకతాయిలు ద్విచక్ర వాహనాలతో దూకుడు ఫలితంగా నిద్రిస్తున్న భక్తులు గాయపడిన ఘటనలు ఉన్నాయి.

పరాయిదైపోయిన పద్మావతి

తిరుచానూరులో భక్తులు బసచేసే ఏర్పాటు ఉంటే తిరుమల మీద ఒత్తిడి కూడా కొంత తగ్గుతుంది. బహుశా ఈ ఆలోచనతోనే ఐదేళ్ల కిందట రూ.100కోట్ల వ్యయంతో పద్మావతి నిలయాన్ని నిర్మించారు. 200 గదులతో నిర్మించిన ఈ భారీ భవనాన్ని భక్తుల వసతి కోసం అందుబాటులోకి తీసుకురాకుండానే ఇతర అవసరాలకు వాడుతున్నారు. కొవిడ్ సమయంలో దీనిని రోగులకు కేటాయించారు. ఆ తర్వాత ఏకంగా జిల్లా కలెక్టరేట్‌గా మార్చేశారు. నిజానికి ఇంత భవనం కలెక్టరేట్‌కి అవసరం కూడా లేదు. కొన్ని గదులు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి.

కదలని క్యూకాంప్లెక్సు నిర్మాణం

వేలాది మంది భక్తులు క్యూలైన్లలో అవస్థలు పడడం ఇక్కడ సాధారణమైపోయింది. ఉదయం, సాయంత్రం నైవేద్య నివేదన సమయంలో దర్శనానికి అనుమతించరు. ఈ సమయంలో భక్తులు వేచి ఉండేందుకు వెయిటింగ్ హాల్ లేదు. దీంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూనే ఉండాలి. ఒక్కోసారి క్యూలైన్లు నిండి మాడవీధుల్లో భక్తులు చొచ్చుకుని వచ్చేస్తారు. ఒక్కసారిగా లైను వదిలినపుడు తోపులాటలు, తొక్కిసలాటలు చేసుకుంటున్నాయి. ఏడాదిన్నర కిందట టీటీడీ రూ.20కోట్లతో ఆలయ సమీపంలోని గేట్ నెంబరు-4 వద్ద ఎకరా స్థలంలో నాలుగు అంతస్థులతో క్యూకాంప్లెక్సు నిర్మించాలని సంకల్పించింది. పాతభవనాలను కూల్చివేసి స్థలాన్ని చదును కూడా చేశారు. అంతే ఆ తర్వాత నిర్మాణం ముందుకుసాగలేదు.

'మరుగు' కష్టాలు

తిరుచానూరు ఆలయ పరిసరాల్లో మరుగుదొడ్లు లేవు. గేట్ నెంబరు-2 వద్ద పంచాయతీ నిర్మించిన మరుగుదొడ్డే భక్తులకు దిక్కవుతోంది. గేట్ నెంబరు-4 వద్ద మరుగుదొడ్డి నిర్మించినా ఇంజనీరింగ్ శాఖ మూసివేసింది. ఇది మందుబాబులకు ఆవాసంగా మారింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము :: గిరిజన కోపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్
గిరిజన ప్రాథమిక సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్,
ఐ.టి.డి.ఏ. ఆఫీస్ కాంప్లెక్స్, కొండాయపాలెం గేటు దగ్గర, నెల్లూరు

Rc.No.GPCMS/NLR/15/2025 Dt.19-09-2025

స్వల్ప టెండర్ ప్రకటన

గిరిజన సహకార సంస్థ, నెల్లూరు వారు ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు మరియు కడప జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థల కొరకు 2025-26 విద్యా సంవత్సరమునకు కావలసిన నిత్యావసర సరుకులు సరఫరా చేయుటకు స్వల్పకాలిక టెండర్లు కోరబడుచున్నవి. సరుకు సంబంధిత వ్యాపారములతో ప్రభుత్వ రంగ సంస్థలకు సరఫరా చేసిన అనుభవం, వ్యాపారమునకు సంబంధించిన రిజిస్ట్రేషన్, జి.ఎస్.టి. రెగ్యులర్, ఇన్‌కంటాక్స్ క్లియరెన్స్ కలవారు ఆ పత్రములను సమర్పించి టెండరు ఫారములను మేనేజరు, గిరిజన ప్రాథమిక సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్, నెల్లూరు వారి కార్యాలయములో Rs.10,000/- (అక్షరములా పది వేల రూపాయలు మాత్రమే) చెల్లించి **తేది.20-09-2025 నుండి 29-09-2025** మధ్యాహ్నం గం.12.00లోగ కార్యాలయపు పనివేళలో టెండరు ఫారంలను పొందగలరు. పూర్తిచేసిన టెండరు ఫారములను **తేది.29-09-2025 మధ్యాహ్నం** గం.1.00 గంటల వరకు మేనేజరు, గిరిజన ప్రాథమిక సహకారా మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్, నెల్లూరు వారి కార్యాలయములో స్వయముగా సమర్పించవలెను. పోస్టు ద్వారా టెండర్లు స్వీకరించబడవు. నిర్దేశిత గడువులోగా అందిన టెండర్లను ఐ.టి.డి.ఏ. కార్యాలయములో **తేది.29-09-2025**న మధ్యాహ్నం గం.2.00లకు కమిటీ సమక్షములో టెండర్లను తెరువబడును. పై విషయములలో టెండర్లు రద్దు చేయుటకు గాని, వాయిదా వేయుటగాని ఈ క్రింది సంతకందారునకు సంపూర్ణ అధికారము కలదు. ఇతర వివరముల కొరకు మొబైల్ నెం.8886068193ను సంప్రదించగలరు.

ప్రాజెక్ట్ అధికారి / ఛైర్మన్
కొనుగోలు కమిటీ, ఐ.టి.డి.ఏ. (యానాదులు), శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు



టీటీడీకి విరాళంగా ఫాస్ట్‌ఫుడ్ వాహనం



తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): టీటీడీకి శుక్రవారం ఓ ఫాస్ట్‌ఫుడ్ వాహనం విరాళంగా అందింది. బెంగుళూరుకు చెందిన ఎంఎస్ రామయ్య విద్యాసంస్థలకు చెందిన ఎంఎస్ సుందర్ రామ్ రూ.14 లక్షల విలువైన వాహనాన్ని అందించారు. దీంతోపాటు టీటీడీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తాళాలను, విరాళం డీడీని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

తిరుమలలో నటి ప్రేమ



తిరుమల శ్రీవారిని శుక్రవారం సినీనటి ప్రేమ, ఎమ్మెల్యే గుడెం మహిపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు లడ్డూ ప్రసాదాలు అందించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.70 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,095
తలనీలాలు సమర్పించినవారు: 23,932



ఆరోగ్యవరప్రసాదినికి రూ.10 లక్షలు



తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య పొలెపల్లి అనే భక్తుడు టీటీడీ బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని పథకానికి రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

శ్రీసిటీని సందర్శించిన హెచ్‌సీసీ బృందం



ప్రసంగిస్తున్న నిరీషా సన్నారెడ్డి

సత్యవేడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై హిందుస్థాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (హెచ్‌సీసీ)కు చెందిన 25 మంది ప్రతినిధుల బృందం (సీఐఐ) శుక్రవారం శ్రీసిటీని సందర్శించింది. ఇక్కడ వ్యాపార అనుకూల అవకాశాలు, పారిశ్రామిక సామర్థ్యాన్ని పరిశీలించింది. సంస్థ చైర్మన్ గోపినాథ్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ తాతియా నేతృత్వంలో విచ్చేసిన హెచ్‌సీసీ బృందానికి శ్రీసిటీ సీఎస్ఆర్ డైరెక్టర్ నిరీషారెడ్డి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీలో ప్రపంచస్థాయి మౌలిక వసతులు, వ్యూహాత్మక ప్రయోజనాలు, ఇతర ప్రత్యేకతలను శ్రీసిటీ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ వివరించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ అధికారులతో చర్చల్లో పాల్గొన్న హెచ్‌సీసీ ప్రతినిధులు, వివిధ అంశాలపై నిశితంగా ఆరాతీసి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం డైకిన్, వరుణ్ బేవరేజెస్, ఎంఎస్ఆర్ గార్మెంట్స్ పరిశ్రమలను సందర్శించారు. కంపెనీల సాంకేతిక నైపుణ్యాలు, తయారీ విధానాలను పరిశీలించారు. సందర్శనకు సహకరించిన శ్రీసిటీ యాజమాన్యానికి గోపినాథ్, ప్రవీణ్ తాతియా కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ ప్రణాళిక, పెట్టుబడి అనుకూల వాతావరణాన్ని కొనియాడారు. పారిశ్రామిక నగరంగా శ్రీసిటీ మరింత అభివృద్ధి సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐఐటీలో నేడు రేపు కళా ఉత్సవం

ఏర్పేడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి ఐఐటీలో ఈనెల 20, 21 తేదీల్లో తిరుపతికి చెందిన ఆర్టిస్టా క్లబ్ ఆధ్వర్యంలో కళాంగిని పేరుతో ప్రత్యేక కళా ఉత్సవం జరగనుంది. ఈ వేడుకల్లో తిరుపతికి చెందిన మహిళా కళాకారిణులు స్టీల్ ఆర్ట్, నిర్మల్ ఆర్ట్ వంటి సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించనున్నారు. శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభం కానున్న ఈ కళా ఉత్సవం ఆదివారం సాయంత్రం 5గంటలకు ముగుస్తుంది. శనివారం కళాఉత్సవం, వర్క్‌షాపులు, సీనరి పెయింటింగ్, ఫ్లోరల్ ఆర్ట్, పేపర్ డెకర్, పాట్ ఆడోర్నమెంట్ వంటివి నిర్వహించనున్నారు. అలాగే పెయింటింగ్‌పై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. 21న ఆదివారం ఆర్ట్ ఎగ్జిబిషన్ జరగనుంది. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ దివాకర్ రెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. సంప్రదాయ కళాఖండాలు, వర్క్‌షాపులతో ప్రత్యేక ప్రదర్శనలు చేపట్టనున్నారు.

ఎర్రచందనం స్మగ్లర్లకు మూడేళ్ల జైలు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడి ఏడుగురు స్మగ్లర్లకు ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు, తలా రూ.20 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. మండలంలోని కారణిమిట్టకు చెందిన సమ్మిటి పెద్దగురవయ్య, కారణి రామయ్య, పిగిలి మోహన్, పిగిలి వెంకటయ్య, చెరివి శ్రీనాథ్, చెరివి రమణయ్య, వెంకటగిరి మునిరత్నంలను ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో 2016లో అప్పటి ఎస్ఐ హేమంత్‌కుమార్‌రెడ్డి అరెస్టు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర నారయణ సాక్ష్యధారాలను నిరూపించి నిందితులకు శిక్ష పడేలా చేశారు. శేషాచలం అడవుల్లో విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్థులకు ఇది హెచ్చరిక అని తిరుపతి ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఈ సందర్భంగా హెచ్చరించారు. నిందితులకు శిక్షపడేలా సహకరించిన శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, బీఎన్‌కండ్రిగ సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడులను ఎస్పీ అభినందించారు.


రూ.13లక్షలు స్వాహా చేశారు

- **ముగ్గురిపై సురేష్ ప్రొడక్షన్స్ మేనేజరు ఫిర్యాదు**

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సురేష్ ప్రొడక్షన్స్‌కు సంబంధించిన రూ.13 లక్షల నగదును స్వాహా చేసినట్లు ఆ సంస్థ మేనేజర్ నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని రెండు సినిమా హాళ్లను సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ లీజుకు తీసుకొని నడుపుతోంది. ఆ సినిమా హాళ్ల నుంచి వచ్చిన నగదును సురేష్ ప్రొడక్షన్స్ ఉద్యోగి సాయి బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తూ ఉంటాడు. మూడు నెలలుగా తక్కువ నగదు డిపాజిట్ చేసి బ్యాంక్ ఇచ్చిన రశీదును మార్చి యాజమాన్యానికి పంపేవాడు. ఇటీవల సురేష్ ప్రొడక్షన్స్ ప్రధాన కార్యాలయం సిబ్బంది పరిశీలించగా సాయి రూ.10 లక్షలు స్వాహా చేసినట్లు, అక్కడే పనిచేస్తున్న బాషా, మాకాని సాయి కలిసి రూ.3 లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఎం ప్రారంభించనున్న పీఏసీ5 భవనాన్ని పరిశీలించిన ఈవో

తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నూతనంగా నిర్మించి ప్రారంబానికి సిద్ధంగా ఉన్న పీఏసీ-5(వేంకటాద్రి నిలయం)ను టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం పరిశీలించారు. 25న సీఎం చంద్రబాబు ఈ భవనాన్ని ప్రారంభిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యంత్రాన్ని అధికారులు పరిశీలించారు. ఈవోతో పాటు సీవీఎస్వో మురళికృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, సీఈ సత్యనారాయణ ఉన్నారు.



మత్స్యకారుల్లో 'అల'జడి

- బతుకు నావకు కొరవడిన భద్రత
- ప్రమాద అంచున జెట్టి నిర్మాణం
- బోట్లు కొట్టుకుపోతాయని ఆందోళన





కోట మండలం గోవిందపల్లిపాళెం తీరం వద్ద జెట్టి ప్రమాదకరంగా ఉండటంతో ఒడ్డున నిలిపివేసి ఉన్న ఇంజన్ బోట్‌లు (ఫైబర్ బోట్) - గోవిందపల్లిపాళెం వద్ద స్వర్ణముఖి, చల్లకాలువ, బకింగ్‌హామ్ కెనాల్ కలిసేచోట నిర్మించి ఉన్న జెట్టి కోతకు గురై నీళ్లల్లో తేలుతున్న దృశ్యం

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ జీవనోపాధికి ఊతంగా నిలిచిన జెట్టి ప్రమాదపు అంచుకు చేరడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఏడెనిమిదేళ్లపాటు తమ బోట్ల భద్రతకు భరోసా ఇచ్చిన ఈ నిర్మాణం సాగరంలోకి కొట్టుకుపోతుందేనని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొట మండలం కొత్తపట్నం పంచాయతీ పరిధిలో గోవిందపల్లిపాళెం, శ్రీనివాస సత్రం గ్రామాలున్నాయి. గోవిందపల్లిపాళెం తీరం నుంచి నిత్యం 200కు పైగా ఇంజన్‌బోట్లతో ఈగ్రామాల మత్స్యకారులు వేటకు వెళ్తుంటారు. అయితే వేట తర్వాత తీరం చేరిన పడవలకు రక్షణ కొరవడేది. మత్స్యకార గ్రామాల ఎగువభాగం నుంచి స్వర్ణముఖి, చల్లకాలువ నదులతోపాటు బకింగ్‌హామ్ కెనాల్ ఉధృతంగా ప్రవహిస్తూ గోవిందపల్లిపాళెం వద్ద బోట్లు, వలలతోపాటు వేట సామగ్రిని ముంచెత్తేది. ఆటుపోట్లు, అలజడులు, ప్రకృతి విపత్తులకు ఇంజన్‌బోట్లు సముద్రంలోకి కొట్టుకుపోయేవి. దీంతో తీవ్రంగా నష్టపోయిన మత్స్యకారులు తిరిగి కొనుక్కునే స్థోమతలేక వేటకు వెళ్లలేక వీధినపడేవారు.

పాశం చొరవతో జట్టి నిర్మాణం

మత్స్యకారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని 2016లో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ చొరవ తీసుకున్నారు. ఆర్ఐడీఎఫ్ కింద రూ.కోటి మంజూరు చేయించారు. ఈ నిధులతో ఇంజన్ బోట్ల రక్షణ కోసం గోవిందపల్లిపాళెం తీరంలో జెట్టిని నిర్మించారు. ఉధృత ప్రవాహాల నుంచి బోట్లు, వలలతోపాటు వేట సామగ్రి కొట్టుకు పోకుండా జెట్టి అడ్డుగోడగా నిలిచింది. ఫలితంగా మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గతేడాది వరద ఉధృతి జెట్టిని కూడా ముంచెత్తింది. దీంతో జెట్టి పూర్తిగా కోతకు గురైంది. నీటిమీద తేలియాడే పరిస్థితికి వచ్చింది. రక్షణ గోడలు, రింగ్‌బండ్‌లు లేకపోవడంతో చుట్టూ ఉప్పునీరు చేరి ఇది కూలిపోయే స్థితికి చేరింది.

అభద్రత తీరాన బోట్లు

ప్రమాదంలో పడిన జెట్టిపై నమ్మకంలేక మత్స్యకారులు విధిలేని పరిస్థితుల్లో తమ బతుకు ఆధారమైన బోట్లను తీరంవద్ద నిలిపేసి వెళ్తున్నారు. దేవుడి మీద భారం వేస్తున్నారు. ఏ క్షణంలోనైనా సాగరంలో తీవ్ర అలజడులు వచ్చినా, వరదనీరు ప్రవహించినా జెట్టి కొట్టుకుపోయేలా ఉందని వీరంతా ఆందోళన చెందుతున్నారు. తక్షణమే జెట్టికి మరమ్మతులు చేపట్టి తమ బోట్లకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

8 కిలోమీటర్లలోపే చేపల వేట



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సముద్రతీరం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరం లోపు వరకే చేపల వేట సాగించాలని మత్స్యకారులకు తహసీల్దారు జయజయరావు, మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి సూచించారు. కోట మండలం గోవిందపల్లిపాళెం సముద్రతీరం వద్ద శుక్రవారం మత్స్యకారుల భద్రతపై మెరైన్, మత్స్యశాఖల ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో వీరు మాట్లాడారు. సముద్రంలోకి ఇతర ప్రాంతాల బోట్లు, అపరిచిత వ్యక్తుల సంచారం ఉంటే తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. జెట్టి నిర్మాణ పనులకు రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. తుఫాను షెల్టర్ల తాత్కాలిక మరమ్మతులకూ నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. అనంతరం గోవిందపల్లిపాళెం సముద్ర తీరంలో మత్స్యకారులతో కలసి అధికారులు విహరించారు. మెరైన్ ఎస్ఐలు నారాయణ రెడ్డి, శివసామ్య, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌డీవో రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా ఆపండి

- ట్రాక్టర్ కింద పడుకొని అడ్డుకున్న గ్రామస్తుడు



ట్రాక్టర్ కింద పడుకొన్న బాపూజీ

చంద్రగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. వీటి జోరుకు ఇళ్లల్లోని పిల్లలు భయాందోళన చెందుతున్నారు' అంటూ చంద్రగిరి మండలం ఎగువ రెడ్డివారిపల్లెలో బాపూజీ అలియాస్ బాబ్జీ అడ్డుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఇసుక ట్రాక్టరు కింద పడుకున్నారు. తెల్లవారు జామున 3 గంటల సమయంలో స్వర్ణముఖినది నుంచి ఇసుకతో ఆయన ఇంటి ముందు ట్రాక్టరు వెళ్తుండగా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్‌కి, బాపూజీకి కొంత వాగ్వాదం చోటుచేసుకొంది. శుక్రవారం ఉదయం కూడా యథావిధిగా ఇసుక ట్రాక్టర్లు తన ఇంటి ముందు పోతుండగా మళ్లీ బాపూజీ అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్ దురుసుగా మాట్లాడారు. ఇసుక రవాణాకు ఎవరు అనుమతులు ఇచ్చారో చెప్పాలంటూ బాపూజీ డిమాండ్ చేశారు. తన ఇంటి ముందు ఇసుక ట్రాక్టర్ వెళ్లకూడదంటూ టైరు ముందు భాగంలో పడుకొన్నారు. ఎలా ట్రాక్టర్ నడుపుతావంటూ అడ్డుకున్నారు. అనంతరం డయల్ 100కి కాల్ చేయగా పోలీసులు ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై బాపూజీ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారిస్తున్నారు.

మహిళల కోసమే వైద్యశిబిరాలు



చంద్రగిరి సీహెచ్‌సీ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

చంద్రగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వస్త్ నారి సశక్త్ అభియాన్ (ఆరోగ్య వంతమైన మహిళ- శక్తిమంతమైన కుటుంబం) పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసమే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాయి. మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబాన్ని బలపరిచే లక్ష్యంతో ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బుధవారం ప్రారంభమైన ఈ వైద్య శిబిరాలను అక్టోబరు 2వ తేది వరకు రెండు వారాల పాటు నిర్వహించనున్నారు. ఈవైద్య శిబిరాలకు మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ శిబిరాల్లో మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, వారికి సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషకాహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాలను స్వశక్తి చేసేలా చర్యలు చేపట్టారు. 'మహిళ ఆరోగ్యం బలపడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుంది. తల్లి ఆరోగ్యంగా ఉంటే పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారు. మహిళా శక్తి సమాజ శక్తికి పునాది అవుతుంది' అనే నినాదంతో మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక వైద్య శిబిరాలలో వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్నారు.

శిబిరాల్లో అందించే వైద్య సేవలివీ

మహిళల్లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి కాన్సర్, గర్భాశయ కాన్సర్‌కు పరీక్షల ద్వారా తగిన వైద్య చికిత్సలను, రెఫరల్ సేవలను అందిస్తున్నారు. మహిళలు, కిశోర బాలికలలో రక్తహీనతను గుర్తించడం, గర్భవతులను పరీక్షించి సరైన పోషకాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై కౌన్సెలింగ్ ఇస్తున్నారు. గర్భిణులకు ఎంసిపి కార్డులు అందజేస్తున్నారు. పిల్లలలో సికిల్ సెల్ అనీమియా గుర్తించి అవసరమైన వారికి చికిత్స చేస్తున్నారు. పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు అందజేస్తారు. యుక్త వయస్సు బాలికలు, మహిళలకు బహిష్టు పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులు అందిస్తున్నారు. ఈ శిబిరాలను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని చంద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ సూచించారు. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులకూ నమోదు చేసుకోవాలన్నారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు

పాకాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌పై శుక్రవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ సుదర్శన ప్రసాద్ తెలిపారు. పాకాల మండలానికి చెందిన ఆటో డ్రైవర్ శివ అలియాస్ అలీ (35) తొమ్మిదేళ్ల బాలికను గురువారం సాయంత్రం మాయమాటలతో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అసభ్యంగా ప్రవర్తించి బలాత్కారం చేయబోయాడు. బాలిక కేకలు వేయడంతో వదిలేశాడు. బాలిక ఇంట్లో చెప్పడంతో ఆటోడ్రైవరును గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుదర్శన ప్రసాద్ శుక్రవారం ఆటో డ్రైవర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

పాలెంపాడులో డీఎంహెచ్‌వో



దొరవారిసత్రం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పాలెంపాడు గ్రామాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ శుక్రవారం సందర్శించారు. ఇప్పటికే ఆ గ్రామంలో పలువురు కిడ్నీ సమస్యలతో మృతి చెందగా, దాదాపు 25 మంది కిడ్నీ సంబంధిత రోగాలతో బాధ పడుతున్నారు. ఇటీవల స్థానిక డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలోని వైద్య బృందం గ్రామస్తులకు రక్త పరీక్షలు చేయడంతో పాటు, నీటి నమూనాలను సేకరించి జిల్లా పరీక్షా కేంద్రానికి పంపారు. నీటి నాణ్యతలో లోపం లేదని తేలడంతో కిడ్నీ సమస్యలకు కారణాలను కనుగొనేందుకు అన్వేషణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వో పాలెంపాడులో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. ప్రత్యేక వైద్య బృందాన్ని పంపి ఎందువల్ల కిడ్నీ సమస్యలు వస్తున్నాయో తేలుస్తామని చెప్పారు. స్థానిక వైద్యులు చైతన్య, లావణ్య ఉన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో 22 నుంచి శరన్నవరాత్రి వేడుకలు



చెంగాళమ్మ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరగనున్నాయి. 11 రోజులపాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారు ఒక్కోరోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే రోజుకొక ప్రాంతం నుంచి సారె సమర్పించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దేవదాయశాఖ అధికారులు చేస్తున్నారు. ఉత్సవాల్లో అమ్మవారు 22వ తేదీన పరమేశ్వరి అలంకారం, 23న గాయిత్రి, 24న అన్నపూర్ణ, 25న అష్టకాళి, 26న మహాలక్ష్మి, 27న బాలత్రిపుర సుందరి, 28న చండి, 29న సరస్వతి, 30న దుర్గాదేవి, 1న రాజరాజేశ్వరి, 2న మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ప్రతి రోజు ఆలయ ప్రాంగణంలో మహా చండీయాగం నిర్వహిస్తామని సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

నానో ఎరువుల వాడకంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో కోరమాండల్ పరిశ్రమ వారు నానో ఎరువుల ప్రాముఖ్యత, వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రసాదరావు మాట్లాడుతూ యూరియా కొరతను అధిగమించడానికి వినియోగం తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. అంతేగాక వాటి వాడకంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయాధికారులపై ఉందన్నారు. కోరమాండల్ ప్రైవేటు లిమిటెడ్ బిజినెస్ మేనేజరు స్వరూప్ దశలవారీగా నానో ఎరువుల వాడకం, నేల ఆరోగ్యం, పర్యావరణం గురించి వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ధనంజయరెడ్డి, జోనల్ మేనేజరు రమణారెడ్డి, సీనియర్ అగ్రానమిస్టు నర్సిరెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండో కోచ్ గోపీనాయుడికి అవార్డు



గోపినాయుడికి అవార్డు, ట్రోఫీ అందజేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రిత్వ శాఖ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్ సంస్థ తిరుపతికి చెందిన తైక్వాండో కోచ్ మాస్టర్ గోపినాయుడికి ప్రతిష్టాత్మక సుభాష్‌చంద్ర బోస్ ఐకాన్ 2025 అవార్డు ప్రదానం చేసింది. టీటీడీ విద్యాసంస్థలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు అందించింది. శుక్రవారం సాయంత్రం ఆయన టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన చేతుల మీదుగా అవార్డు, జ్ఞాపికను అందుకున్నారు.

30 కిలోల గంజాయి స్వాధీనం : నలుగురి అరెస్టు



గంజాయి సీజ్ చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న నలుగురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు... ఒడిశా రాష్ట్రం రానాలి గ్రామానికి చెందిన డోస్ చాందిని, దానుపాణి, జోసెఫ్ బర్దాన్ తిరుపతిని కేంద్రంగా చేసుకుని గంజాయి వ్యాపారం సాగిస్తున్నారు. ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి తమిళనాడులోని స్మగ్లర్లకు విక్రయిస్తున్నారు. శుక్రవారం అందిన రహస్య సమాచారం మేరకు రామతులసి కల్యాణ మండపం వద్ద తమిళనాడు తిరునల్వేలి జిల్లా కొక్కిరాకులం గ్రామానికి చెందిన ఎం.ముత్తువేలు గంజాయి తీసుకెళుతుండగా ఈస్ట్ సీఐ శ్రీనివాసులు సిబ్బందితో కలసి పట్టుకున్నారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు ఒడిశాకు చెందిన డోస్ చాందిని, దానుపాణి, జోసెఫ్ బర్దాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కండి



స్వచ్ఛత హీ సేవ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. సూళ్లూరుపేటను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య పిలుపునిచ్చారు. అక్టోబరు 2న గాంధీ జయంతి వరకు అన్ని వార్డుల్లో పరిశుభ్రతపై సచివాలయ సిబ్బంది అవగాహన కల్పిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సూళ్లూరు నాగరాజపురంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ ఉన్నతి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దిగువ చావాలి సచివాలయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబం' కార్యక్రమాన్ని పెళ్లకూరు పీహెచ్‌సీ వైద్యుడు జితేంద్రతో కలసి నరేంద్రరెడ్డి ప్రారంభించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన పక్షోత్సవాల్లో భాగంగా అక్టోబరు 2 గాంధీ జయింతి వరకు గ్రామాల్లో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

షార్‌లో గురుపూజోత్సవం


సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్, విశ్రాంత వైస్ చాన్సలర్ సుధా, షార్ అధికారులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని ఎంఆర్ కురుప్ ఆడిటోరియంలో శుక్రవారం గురుపూజోత్సవం నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంజీఆర్ మెడికల్ యూనివర్సిటీ విశ్రాంత వైస్ చాన్సలర్ డాక్టర్ సుధా సేషయన్ విచ్చేశారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. షార్‌లోని అంతరిక్ష కేంద్రియ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ జీ.రమేష్ బాబు, అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెరియన్, ఎంఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

నాయుడుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకుడు ముకుంద అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయుడుపేట సెజ్‌లోని చాలా పరిశ్రమల్లో యాజమాన్యాలు భద్రతా చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇటీవల పెళ్లకూరు, ఓజిలి మండలాల్లోని పరిశ్రమల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో కార్మికులు ప్రాణాలు పోయాయని, సంబంధిత అధికారులు కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మస్తాన్‌రెడ్డి, కాలేషా, శంకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపొద్దు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపరాదని నవజీవన్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సత్యం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గిరిధర్‌రెడ్డి, మంజుల, నందిని తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది పరిసర ప్రాంతాల్లో ఇసుకను అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పట్టపగలే ఎక్స్‌వేటర్లతో ఇసుక తవ్వి తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా స్వర్ణముఖినదిలో రైల్వే బ్రిడ్జి పక్కనే ఇసుక తవ్వేస్తుండటంతో ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. అధికారులు అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ బాలికను గర్భవతిని చేసిన నాగరాజు అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు. కడప ప్రాంతానికి చెందిన నాగరాజు కొంతకాలంగా పట్టణంలో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా ఉంటున్న బాలికను గర్భవతిని చేయడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

దాడి కేసులో రూ.500 జరిమానా

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దాడి కేసులో నిందితుడికి నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షిసుందరి రూ.500 జరిమానా విధించినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. 2018లోని గొట్టిప్రోలు గ్రామానికి చెందిన గోపాల్‌పై అదే గ్రామానికి వెంకటయ్య కర్రతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారించిన న్యాయమూర్తి వెంకటయ్యకు రూ.500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఈ దారిలో వెళ్లేదెలా?

- బురదమయంగా తాళ్వాయిపాడు అరుంధతికాలనీ రోడ్డు
- నడిచేందుకూ వీలుకాని దుస్థితి ● ఏళ్లుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పెళ్లకూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండల పరిధిలోని తాళ్వాయిపాడు అరుంధతి కాలనీ గ్రామానికి వెళ్లే దారి చినుకుపడితే బురదమయంగా మారడంతో నడుద్దామన్నా వీలుకాక గ్రామస్తులు నరక యాతన పడుతున్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి జాతీయ రహదారికి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న అరుంధతికాలనీ సరైన రహదారి సౌకర్యం లేదు. మట్టిరోడ్డు కావడంతో రెండురోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షానికి పూర్తిగా బురదమయంగా మారి కనీసం నడుద్దామన్నా వీలుకాని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు ప్రయాణించడం కూడా కష్టంగా మారింది. మండలంలో మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారులు బీటీ, సీసీ రోడ్లతో కళకళలాడుతుంటే జాతీయ రహదారికి కూతవేటు దూరంలోని తాళ్వాయిపాడు అరుంధతికాలనీకి సరైనదారి సౌకర్యం లేకపోవడం పట్ల కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని రోడు సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


చిత్తడిగా మారిన తాళ్వాయిపాడు అరుంధతి కాలనీ దారి

సూళ్లూరుపేటలో భారీ వర్షం: జలమయమైన రోడ్లు


బాలికల ఉన్నత పాఠశాల ఎదుట వర్షపునీటితో విద్యార్థుల ఇబ్బందులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్నాహ్నం వరకు భానుడు భగభగతో జనాలు అల్లాడిపోయారు. సాయంత్రం 4 గంటల సమయంలో కారు మబ్బులు కమ్ముకుని ఉరుములతో కూడిన భారీ వర్షం కురవడంతో పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ జలయమంగా మారాయి. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి జీఎన్‌టీ రోడ్డులో పోలీసుస్టేషన్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు మోకాటి లోతు వర్షపునీళ్లు నిలబడడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని సాయినరగ్, ఇసుకమిట్ట, హోలీక్రాస్ కూడలి ప్రాంతాల్లో మురుగు కాలువలు పొంగడంతో వర్షపునీరంతా రోడ్లపై నిలబడడంతో విద్యార్థులు, స్థానికులకు అవస్థలు తప్పలేదు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పక్కనే ఉన్న మురుగుకాలువ పొంగడంతో పాఠశాల ప్రాంగణంలోకి నీరువెళ్లడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా, కార్యాలయాల ముందు మోటాటి లోతు నిలబడింది. సూళ్లూరుపేట పట్టణంలో మురుగునీరు పారుదలకు మురుగునీటి కాలువలు సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షమొచ్చిన ఇండ్ల మధ్యలో రోడ్లపైకి నీరుచేరుతోంది.

గూడూరులో మోస్తారు వర్షం

గూడూరు: పట్టణంలో శుక్రవారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉన్నా సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై గంటపాటు మోస్తారు వర్షం కురి సింది. ఐసీఎస్‌రోడ్డు, కోనేటిమిట్ట, ఆసుపత్రిరోడ్డు, అశోక్‌నగర్, మాళవ్యా నగర్ ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు ప్రవహించింది.

బాలాయపల్లిలో...

బాలాయపల్లి: మండలంలో కురిసిన మోస్తరు వర్షంతో చిన్నచిన్న గుంటలు, కాలువల్లో నీరు చేరింది. వరి పంట చేతికి వచ్చే సమయంలో వర్షం పడడంతో నష్టాలకు దారి తీస్తుందని గాజులపల్లి, వెంగమాంబపురం, నిడిగల్లు గ్రామాలు రైతులు వాపోతున్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఇసుజు, జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి 125 మంది యువతి, యువకులు విచ్చేశారు. వీరందరికీ రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 60 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశానమని ఇసుజు కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ నరేష్ తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు అజయ్ కుమార్, వంశీకృష్ణ, జేకేసీ కోఆర్డినేటర్స్ మధుబాబు, జీకే ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బీ శంకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనార్టీల అభ్యున్నతి


అబ్దుల్‌రహీంకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే మైనార్టీల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఆ పార్టీ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్‌రహీం అన్నారు. శుక్రవారం స్థానిక జీఎస్ రాయులు సెంటర్‌లోని మైనార్టీ కార్యాలయంలో అబ్దుల్‌రహీం పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గూడూరు నియోజకవర్గంలో ముస్లింల సంక్షేమానికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సహకారం అందిస్తున్నారన్నారు. అందరం కలిసికట్టుగా ఉంటూ టీడీపీ పటిష్టతకు కృషి చేద్దామన్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు అబ్దుల్ రహీంకు శుభాకాంక్షలు తెలిపారు.

పోషణపై అవగాహన

గూడూరు అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నమాజ్‌కట్ట ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ సుజన మాట్లాడుతూ పిల్లలు, తల్లల పోషణ, సంరక్షణలో పురుషులు భాగస్వామ్యం కావాలన్నారు. ఇది కుటుంబ బంధాన్ని బలంగా ఉంచుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆరోగ్య సూచనలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జయశ్రీ, సుభాషిణి, షాజిదా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని వేములపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీదేవి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

గూడూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు సుమన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సైద్ధాంతిక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడమే కాకుండా విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వివేకానందస్వామిని ఆదర్శంగా తీసుకుని ఏబీవీపీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సోమశేఖర్, సత్యనారాయణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గూడూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలిచెర్లరాజుపాళెం ఎస్టీ కాలనీలో శుక్రవారం తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సహకారంతో చర్యలు చేపట్టారు. తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నామని ఎస్టీ కాలనీవాసులు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించేందుకు బోరు తవ్వించారని టీడీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురాజు, సుబ్బరాజు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కోసం నిరసన


నిరసన తెలుపుతున్న వీసీ అగ్రహారం రైతులు

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీ వీసీ అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. సాగరమాల పనులకు భూములిస్తే ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని అధికారులు పట్టించుకోవడంలేదని, తక్షణం స్పందించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక 9వ బెటాలియన్‌లో పెనుశిల క్షేత్రంలోని విజయేశ్వరి మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను కమాండెంట్ ఈఎస్ఎస్ ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు.

క్రీడాకారులకు అభినందన


డివిజన్‌స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి ఉన్నత పాఠశాల విద్యార్థులు డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మస్తానయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయ తెలిపారు. ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు కోటలో మండలస్థాయి పోటీలు నిర్వహించారు. వాలీబాల్, చదరంగంలో అండర్ 14 విభాగంలో విద్యార్థులు ప్రతిభ చూపి డివిజన్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం వారిని షీల్డ్‌లు, మెమోంటోలతో హెచ్‌ఎం, పీడీ అభినందించారు.

ఉపాధి పనుల తనిఖీ

దక్కిలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సంగనపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో రవీంద్రబాబు తనిఖీ చేశారు. అందరికీ పనులు కల్పిస్తున్నారా, ఉపాధి కూలి డబ్బులు సకాలంలో అందుతున్నాయా అని కూలీలను అడిగి తెలుసుకొన్నారు. ఉపాధి పనులకు రాకుండా మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి యూపీఆర్డీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో గ్నోసిస్ సదస్సు

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం గ్నోసిస్ 2025 సామాజిక సింకోజియం సదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. మహిళా సాధికారిత, వ్యవసాయంలో టెక్నాలజీ, సోషల్ మీడియా ప్రభావాలు, యోగా, జ్ఞానం, లీ లెర్నింగ్ వంటి అంశాలపై విద్యార్థులు పోస్టల్, పేపర్, ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ శ్రీనివాసులు, శివప్రతాప్‌రెడ్డి, డాక్టర్ హరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాలకు వ్యతిరేకిస్తూ నాయుడుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు నిరసన తెలిపారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బోసిపోయింది.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీవో షంషాద్ బేగం అన్నారు. శుక్రవారం స్థానిక జంగాలపల్లి సచివాయలంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడంతో పాటు ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆకు కూరలు, పాలు, గుడ్డు ప్రతిరోజూ తీసుకోవాలన్నారు. అనంతరం బాలామృతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బంగారుపేట పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్, పీఎస్ రమణయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Nellore-3 బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన ... Sri Syed Hidayathshahid S/o. Syed Shahidulla గారికి ... 7 దినములలో ... తెలియజేయుచున్నాను.

SCHEDULE

గూడూరు రి.డి. జిల్లా, గూడూరు సబ్.రి.లో చేరిన, గూడూరు మండలంలోని పోటుపాళెం గ్రామ పంచాయితీలో చేరిన, ... సర్వే నెం.1036/3 ... సర్వే నెం.1010/1 ... సర్వే నెం.1019 ... సర్వే నెం.1013/2 ... సర్వే నెం.1020 ... సర్వే నెం.1015 ... సర్వే నెం.1022 ... సర్వే నెం.1019/1 ... సర్వే నెం.1017 ... సర్వే నెం.1019/3 ... సర్వే నెం.1033/1 ... సర్వే నెం.1016 ... సర్వే నెం.1029/బి ... సర్వే నెం.1036/2ఎ ... సర్వే నెం.1010/2 ... సర్వే నెం.1014/బి ... సర్వే నెం.1023 ... సర్వే నెం.1023/బి ... సర్వే నెం.1025 ... సర్వే నెం.1027/1ఎ ... సర్వే నెం.1024/1బి ... సర్వే నెం.1027/2ఎ ... 1026/1ఎ ... డైరెక్టర్ ఆఫ్ ప్లానింగ్, హైదరాబాద్ వారి వలన L.P.No.32/2005/N దు C.No.3264/05/N దుగా అప్రూవ్ కాబడిన "GOLDEN GUDUR" అను ... నెం.618దు ప్లాటు విస్తీర్ణం 27 అంకణములా 56 చ.అ.లు లేక 222.222 చ.గజలు ... 33 అడుగుల వెడల్పు గల లేఅవుట్ రోడ్డు, దక్షిణం: నెం.619దు ప్లాటు, పడమర: నెం.609దు ప్లాటు, ఉత్తరం: నెం.617దు ప్లాటు. ఈ హద్దులలోని 27 అంకణములా 56 చ.అ.లు లేక 222.222 చ.గజలు స్థలమున్నూ ...

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

